RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | శనివారం, జూన్ 27, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 66 | పేజీలు: 8 | వెల : రూ.1



## ప్రైవేట్ కాలేజీల యజమాన్యాలకు ఊరట

## ఐఏఎస్ బదిలీలు




హైదరాబాద్, జూన్ 26 : రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ.. తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు వెలువరించింది. ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహాదారుగా నియమించింది. ఈ క్రమంలోనే మొత్తం 13 మంది ఐఏఎస్ అధికారులకు.. బదిలీలు, పోస్టింగ్‌లు కల్పించింది. అదే సమయంలో సీఎంఓ నుంచి అజిత్ రెడ్డిని తొలగించింది. ఈ నేపథ్యంలోనే సీనియర్ ఐఏఎస్ శ్రీధర్‌కు సీఎంఓలో కీలక బాధ్యతలు అప్పగించారుఈ క్రమంలోనే సబ్యసాచి ఘోష్‌కు హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ శాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అప్పగించింది. అదే సమయంలో శైలజా రామయ్యర్‌ను ఈఎఫ్ఎస్ అండ్ టీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా బదిలీ చేసింది. అహ్మద్ నదీమ్‌కు పొలిటికల్ (జీఏడీ) ప్రిన్సిపల్ సెక్రటరీగా బాధ్యతలు అప్పగించింది. ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీగా ఎన్ శ్రీధర్.. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీగా రాహుల్ బొజ్జాకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతలు ఇచ్చింది.మైన్స్ అండ్ జియాలజీ శాఖ అదనపు బాధ్యతలను ఎం.రఘునందన్ రావుకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవోగా అజిత్ రెడ్డిని ట్రాన్స్‌ఫర్ చేసింది. హ్యాండ్లూమ్స్ అండ్ హ్యాండీక్రాఫ్ట్స్ స్పెషల్ సెక్రటరీగా పి. కాత్యాయని దేవికి పోస్టింగ్ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆర్అండ్‌బీ శాఖ స్పెషల్ సెక్రటరీగా కె. గంగాధర్‌ను బదిలీ చేసింది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్‌గా టి. వెంకన్నకు పోస్టింగ్ ఇచ్చింది. టూరిజం డైరెక్టర్‌గా కె. విద్యాసాగర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఈ క్రమంలోనే తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ)లో కీలకమైన మార్పులకు రేవంత్ రెడ్డి సర్కార్ శ్రీకారం చుట్టారు. పాలనా యంత్రాంగాన్ని మరింత పరుగులు పెట్టించడంలో భాగంగా సీఎంవోలో భారీ ప్రక్షాళన చేపట్టింది. గత కొంతకాలంగా సీఎంవోలో కీలక బాధ్యతల్లో ఉన్న అజిత్ రెడ్డిని తీసేసి.. శ్రీధర్‌కు చోటు కల్పించారు. శ్రీధర్ రాకతో సీఎంవోలో పాలనాపరమైన నిర్ణయాలు మరింత వేగం పుంజుకుంటాయని తెలంగాణ సచివాలయ వర్గాలు ఆకాంక్షిస్తున్నాయి.



## ముదిరిన అయోధ్య రామమందిర కానుకల చోరీ కేసు

అయోధ్య, జూన్ 26 : సిట్ దర్యాప్తు అనంతరం ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో అయోధ్య రామ మందిర కానుకల చోరీ కేసు మరింత ముదిరింది. రామ మందిర తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ ఇప్పుడు రాజీనామా చేశారు. ఆయనతోపాటు అనిల్ మిశ్రా కూడా తప్పుకున్నారు. విరాళాలు, కానుకల దొంగతనం ఆరోపణల నేపథ్యంలో చంపత్ రాయ్, అనిల్ మిశ్రా ఇద్దరిపై రాజీనామా చేయాలని ఒత్తిడి ఉన్నట్లు సమాచారం. అందుకే వారు తప్పుకున్నారు.రామ మందిర విరాళాల దొంగతనం కేసులో సిట్ నివేదిక నేపథ్యంలో, పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేసిన ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. నిందితులు ఎనిమిది మంది మధ్యాహ్నం 2:00 గంటల తర్వాత కోర్టులో హాజరుపరుస్తారు. మొహర్రం కారణంగా ఈరోజు కోర్టులకు సెలవు. అందువల్ల, నిందితులను మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరుస్తారు. డ్యూటీ వీవీ లేదా డ్యూటీ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ అనగా, సాధారణ కోర్టు పనివేళల వెలుపల, సెలవు దినాల్లో లేదా వారాంతాల్లో, అరెస్టు, రిమాండ్ లేదా బెయిల్‌కు సంబంధించిన అత్యవసర న్యాయపరమైన విషయాలను విచారించడానికి నియమించిన న్యాయమూర్తి.రామ మందిర కానుకల దొంగతనం కేసులో ఎఫ్ఐఆర్ నమోదు అయిన అనంతరం, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఒక కీలక ప్రకటన విడుదల చేశారు. ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించిందని ఆయన తెలిపారు. సిట్ వేగంగా దర్యాప్తు జరిపి తన నివేదికను సమర్పించగా, వెంటనే కేసులు నమోదు చేశారు. ప్రజా విశ్వాసాన్ని దెబ్బతీసే వారిని వదిలిపెట్టబోమని ఆయన అన్నారు. అయోధ్య హిందూ విశ్వాసానికి ప్రతీక. విశ్వాసాన్ని దెబ్బతీయడం ఆమోదయోగ్యం కాదు అని అన్నారు.

### కేసు పూర్వాపరాలు ఏంటీ

ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామ మందిరంలో కానుకల దొంగతనం జరిగింది. ఇది బహిర్గతమైన వెంటనే ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. ఆ సిట్ నివేదిక ఆధారంగా జూన్ 25న ఎఫ్ఐఆర్ నమోదైంది. ఇందులో పలువురు గుర్తుతెలియని వ్యక్తులతోపాటు, ఎనిమిది మందిని నిందితులుగా చేర్చారు. ట్రస్ట్ సభ్యుడు కృష్ణమోహన్ ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు ఆధారంగా, శ్రీ రామ్ జన్మభూమి పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుష్ మిశ్రా, మనీష్ కుమార్ యాదవ్, కరుణేష్ పాండే, రామశంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ, శ్రీరామ్ శంకర్ యాదవ్ అలియాస్ తిను పేర్లు చేర్చారు. గుర్తించని ఇతర వ్యక్తులను కూడా నిందితులుగా పేర్కొన్నారు. నిందితులపై భారత శిక్షాస్మృతిలోని వివిధ సెక్షన్లు, అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 13(1)(ఎ) కింద అభియోగాలు మోపారు.ఎఫ్ఐఆర్ నమోదైన వారందరూ ఆలయంలోని విరాళాలు, నగదు నిర్వహణతో ఏదో ఒక విధంగా ఆలయం ట్రస్ట్‌తో సంబంధం కలిగి ఉన్నారని చెబుతున్నారు. ట్రస్టు ప్రధాన కార్యదర్శి అయిన చంపత్ రాయ్‌కు తిన్ను యాదవ్ సహచరుడని చెబుతున్నారు. విరాళాల పెట్టె తాళాలు అతని వద్దే ఉన్నాయని విచారణలో వెల్లడైంది. అనుకల్ప్ మిశ్రా విరాళాలను లెక్కించేవాడు . లవ్‌కుష్ మిశ్రా, అనుకల్ప్ మిశ్రాకు బంధువని చెబుతున్నారు. మనీష్ యాదవ్, తిన్ను యాదవ్ మేనల్లుడు. సుభాష్ శ్రీవాస్తవ నగదు లెక్కించేవాడు. విరాళాల లెక్కింపు ప్రక్రియలో అవినాష్ శుక్లా కూడా పాలుపంచుకున్నాడు. కరుణేష్ పాండే, రామశంకర్ మిశ్రా కూడా నగదు లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్నారు.ఎఫ్ఐఆర్‌లో నిందితులుగా పేర్కొన్న వ్యక్తులు చాలావరకు

(మిగతా 2వ పేజీలో)



## వరంగల్‌లో ఇసుక దుమారం

వరంగల్ జూన్ 26, (వాయిస్‌టుడే) : వరంగల్ జిల్లా పాలిటిక్స్‌లో ఇప్పుడు ఇసుక దుమారం రేగుతోంది. ఇసుక దందాతో ఇద్దరు మంత్రులు వేల కోట్లు దోచుకుంటున్నారని ఆరోపిస్తూ అధికార పక్షాన్ని ఇరుకున పెట్టే ప్రయత్నంలో ఉంది బీఆర్ఎస్. ములుగు జిల్లాలో ఎప్పుడూ లేనివిధంగా ఇసుక దోపిడీ జరుగుతోందని విపక్షం చేస్తున్న ఆరోపణలు పొలిటికల్ మంటలు పుట్టిస్తున్నాయి. దోపిడీకి సంబంధించి మా దగ్గర డ్రోన్ విజువల్స్, ఇతర ఆధారాలు ఉన్నాయంటూరోజుకో ప్రెస్ మీట్ పెట్టి హడావిడి చేస్తున్నారు గులాబీ నేతలు. అలాగే... దీనికి సంబంధించి సోషల్ మీడియాలో విపరీతమైన ప్రచారం జరుగుతోంది. ఇలాంటి సందర్భంలో దీనికి కౌంటర్ ఇవ్వడంలో జిల్లా కాంగ్రెస్ నేతలు విఫలమవుతున్నారన్న గుసగుసలు సైతం వినిపిస్తున్నాయి. ఇద్దరు మంత్రులు అంటూ... బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారంపై కేవలం ములుగు జిల్లా పార్టీ నేతలు మినహా... కాస్తంత హోదా ఉన్న, పెద్ద నాయకులు ఎవరూ ఎందుకు

(మిగతా 2వ పేజీలో)

## ప్రభుత్వ ఉద్యోగులకు ప్రజా ప్రభుత్వం బంపర్ ఆఫర్

### ::: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలోని లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాల్లో భద్రత, భరోసా కల్పించేందుకు ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని క్యాబినెట్ ఉద్యోగుల సంక్షేమం కోసం దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా సరికొత్త ఉచిత బీమా పథకాన్ని ఆమోదించిందని ఆయన వెల్లడించారు. ఈ పథకం ద్వారా అటు ప్రభుత్వంపై కానీ, ఇటు ఉద్యోగులపై కానీ ఒక్క రూపాయి కూడా అదనపు భారం పడకుండా, బ్యాంకులతో మాట్లాడి ఈ భారీ బీమా రక్షణను కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ అద్భుతమైన బీమా పథకం ద్వారా సాధారణ ప్రమాదాల్లో మరణిస్తే రూ. కోటి 25 లక్షలు, అదే విమాన ప్రమాదం జరిగితే రూ. 2 కోట్ల నుంచి రూ. 3 కోట్ల వరకు బీమా పరిహారం అందుతుందని భట్టి విక్రమార్క వివరించారు. 18 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల ఉద్యోగులకు రూ.10 లక్షల జీవిత బీమా రక్షణ ఉంటుందన్నారు. ప్రమాదవశాత్తూ శాశ్వత సంపూర్ణ వైకల్యం లేదా పాక్షిక వైకల్యం సంభవించినా ఈ పథకం ద్వారా ఉద్యోగులకు ఆర్థిక అండ లభిస్తుందన్నారు. కేవలం రెగ్యులర్ ఉద్యోగులకే కాకుండా.. నెలనెలా ప్రభుత్వ రికార్డుల ద్వారా జీతం పొందే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, ఇతర తాత్కాలిక ఉద్యోగులందరికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. తమ కుటుంబంలో సంపాదించే వ్యక్తికి ఏదైనా ఆపద వస్తే ఆ కుటుంబం రాత్రికి రాత్రే రోడ్డున పడే పరిస్థితి ఉండకూడదు. ఉద్యోగులు కేవలం జీతగాళ్లు కాదు, వారి కుటుంబాలకు ఈ ప్రభుత్వం ఒక పెద్ద దిక్కుగా ఉంటుందని నమ్మకం కలిగించడమే మా లక్ష్యమని భట్టి విక్రమార్క చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో జీతాలు 15 లేదా 20వ తేదీ వరకు రాకపోవడం వల్ల ఉద్యోగులు పడిన ఇబ్బందులను భట్టి విక్రమార్క గుర్తుచేశారు. ప్రస్తుత కాలంలో ఇళ్లు, వాహనాలు, పిల్లల చదువుల కోసం ప్రతి ఒక్కరూ బ్యాంక్ ఇన్‌స్టాల్మెంట్స్ ఈఎంఐలు, కడుతున్నారు. సకాలంలో జీతాలు రాకపోతే వారి అకౌంట్లు బ్యాడ్ అకౌంట్స్‌గా మారి సిబిల్ స్కోర్ దెబ్బతినేది.మా ప్రభుత్వం రాగానే ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉన్నప్పటికీ, సీఎం రేవంత్ రెడ్డి ఉద్యోగుల హక్కులను కాపాడాలి అని గట్టిగా నిర్ణయించుకుని, ఒకటో తేదీ నాడే జీతాలు ఇచ్చేలా కఠినమైన ప్రణాళికను అమలు చేశారని అన్నారు.

## ఎట్టకేలకు వై. శ్రీలక్ష్మికి ప్రభుత్వం పోస్టింగ్



విజయవాడ, జూన్ 26, (వాయిస్ టుడే ) : ఆంధ్రప్రదేశ్ బ్యూరోక్రసీలో వివాదాస్పద అధికారిణిగా గుర్తింపు పొందిన 1988 బ్యాచ్ సీనియర్ ఐఏఎస్ వై. శ్రీలక్ష్మికి ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఎలాంటి బాధ్యతలు లేకుండా వెయిటింగ్ లో ఉన్న ఆమెను.. హఠాత్తుగా రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమిస్తూ చంద్రబాబు సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఈ ఆకస్మిక నిర్ణయం వెనుక ఎలాంటి రాజకీయ ప్రాధాన్యతలు లేవని, కేవలం మానవతా దృక్పథంతో ఆమెకు గౌరవప్రదమైన వీడ్కోలు పలికేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందనే పచ్చి నిజం బ్యూరోక్రాటిక్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. అధికారిక నిబంధనల ప్రకారం.. వై. శ్రీలక్ష్మి ఈ జూన్ 30వ తేదీతో తన సుదీర్ఘ ఐఏఎస్ సర్వీసు నుండి రిటైర్ కానున్నారు. అంటే ఆమె పదవీ కాలం ముగియడానికి కేవలం మరో నాలుగు రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఒకవేళ ఎలాంటి పోస్టింగ్ లేకుండా వెయిటింగ్‌లోనో లేదా లూప్ లైన్ పరిధిలోనే రిటైర్ అయితే, ఆ ప్రభావం ఆమె రిటైర్మెంట్ బెనిఫిట్స్‌పై, పెన్షన్ నిబంధనలపై పడే అవకాశం ఉంది. ఒక సీనియర్ మహిళా అధికారిణిగా ఆమె సుదీర్ఘ కెరీర్ ముగింపు దశలో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో, సర్వీసులో ఉంటూ గౌరవప్రదంగా ఉద్యోగ విరమణ పొందేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు భావిస్తున్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కెరీర్ ప్రారంభించిన వై. శ్రీలక్ష్మి.. రాష్ట్ర విభజన సమయంలో

(మిగతా 2వ పేజీలో)



## అడ్డంగా బుక్కైన సీఐ నాగరాజు

విజయవాడ, జూన్ 26, (వాయిస్ టుడే ) : ఏపీలో సంచలనంగా మారుతోంది సాయి కృష్ణ లాకప్ డెలిత్ మిస్టరీ. ఇప్పటికే వైసీపీ నేతలు కుల రాజకీయం మొదలుపెట్టారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై వ్యక్తిగతంగా, రాజకీయంగా, కుల పరంగా టార్గెట్ చేశారు. అదృశ్యం తరహాలో కేసు విచారణ మొదలుపెట్టిన ప్రత్యేక దర్యాప్తు బృందం ఇందుకు ప్రధాన నిందితుడిగా భావిస్తున్న సిఐ నాగరాజును అదుపులోకి తీసుకుంది. అయితే సాయి కృష్ణ మిస్సింగ్ మిస్టరీ కాస్త

(మిగతా 2వ పేజీలో)

## 10 రెస్టారెంట్లలో 9 దారుణం



హైదరాబాద్, జూన్ 26, (వాయిస్ టుడే ) : జొమాటో లేదా స్విగ్గి.. ఉబర్.. ఇలా ఎన్నో ఉన్నాయి. జస్ట్ ఫోన్ ఆన్ చేయడం.. యాప్ ఓపెన్ చేయడం.. ఆఫర్లు చూడడం.. నచ్చిన ఆహారం సెలెక్ట్ చేయడం.. ఆర్డర్ పెట్టడం.. పేమెంట్ ఆన్లైన్లోనే చేసేయడం.. ఉదయం టిఫిన్.. మధ్యాహ్నం భోజనం.. సాయంత్రం డిన్నర్.. మధ్యలో స్నాక్స్.. చివరికి కేకులు.. బర్గర్లు.. పిజ్జాలు.. సూప్ లు కూడా అందులోనే.. ఆర్డర్ పెట్టిన కొత్త సమయానికి కళ్ళ ముందుకు వస్తుంది. కాళ్ల దగ్గరికి వస్తుంది. అలాంటప్పుడు ఇలాంటి తిండిని ఎవరు కాదనుకుంటారు.. కొంతకాలంగా హైదరాబాదులో సగటు నగర జీవి ఇటువంటి రెడీమేడ్ ఫుడ్ కే అలవాటు పడ్డాడు. చివరికి వివాహం జరిగిన వారు సైతం ఆన్లైన్లోనే ఆర్డర్ పెట్టుకుంటున్నారు. వండే శ్రమ లేకుండా.. చెమటలు చిందించకుండా దర్జాగా తింటున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. తెస్తున్న ఫుడ్ ఎలా ఉంటుంది.. ఎలాంటి పరిస్థితుల్లో తయారుచేస్తున్నారు.. వాటి వల్ల ఎలాంటి రోగాలు వస్తాయి ఎవరూ గుర్తించడం లేదు. చివరికి ఆఫీసర్లు చేసిన దాడుల్లో.. దిగ్భ్రాంతి కరమైన వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. హైదరాబాద్ నగరంలో ఈ నెలలో 10 రెస్టారెంట్లను అధికారులు తనిఖీలు చేస్తే.. అందులో తొమ్మిది అత్యంత దారుణంగా ఉన్నాయని తేలింది. చెత్తబుట్టలో వేయాల్సిన ఆహారాన్ని వారు విక్రయిస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. దారుణమైన ఆహారాన్ని రకరకాల రంగులు.. మసాలాలు దట్టించి ప్లేట్లో పెడుతున్నారు.

### అంతేరా..

ఈ రెస్టారెంట్ మదినగూడ లో ఉంది. ఇక్కడ కూరగాయలకు బూజు పట్టి ఉంది. వాడిన నూనె మళ్ళీ మళ్ళీ ఉపయోగించడానికి

(మిగతా 2వ పేజీలో)

వాయిస్ ఆఫ్ ప్రజలు

శనివారం, జూన్ 27, 2026

# వరంగల్‌లో ఇసుక దుమారం



రియాక్ట్ అవడం లేదన్న చర్చలు హాట్‌హాట్‌గా నడుస్తున్నాయి. రాష్ట్ర మంత్రులు ఇద్దరు కలిసి ములుగు జిల్లా పరిధిలోని గోదావరి ఇసుకను మింగేస్తున్నారంటూ డైరెక్ట్‌గా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సీతమ్మ సాగర్‌లో అక్రమంగా ఇసుక తవ్వి దాదాపు 4 వేల కోట్ల రూపాయలు వెనకేసుకునేందుకు మంత్రులు ఇద్దరూ ప్రయత్నిస్తున్నారన్నది కేటీఆర్ ఆరోపణ. ఇసుక మాఫియా సూత్రధారులను బయటకు లాగాలన్నది ఆయన డిమాండ్. దీనికి సంబంధించి ములుగు కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు గులాబీ నేతలు. ఇలా ఇసుక దోపిడీ పేరుతో అధికార పక్షాన్ని ఇరుకునపెట్టేలా బీఆర్ఎస్ నేతలు రోజుకో కార్యక్రమం నిర్వహిస్తున్నా. అధికార పక్షం నుంచి గట్టిగా తిప్పికొట్టే ప్రయత్నం మాత్రం జరగడంలేదని సొంత పార్టీలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. కేవలం ములుగు నాయకులు, అందునా ఒక మంత్రి అనుచరగణం తప్ప... ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏ ముఖ్య నేతా ఎందుకు స్పందించలేదన్నది పెద్ద ప్రశ్నగా మారింది. ఆ విషయంలో కాంగ్రెస్ వాళ్ళు ఎందుకు వెనకడుగు వేస్తున్నారంటూ ఎవరికి వారు రకరకాల విశ్లేషణల్లో మునిగిపోయారు. ములుగు జిల్లా డీసీసీ అధ్యక్షుడు అశోక్, జిల్లా పార్టీలోని కొందరు నాయకులు మాత్రమే బీఆర్ఎస్ ఆరోపణలకు రియాక్ట్ అయి నిరూపించమంటూ సవాల్ విసిరారు. మిగతా మంత్రులు, ఎమ్మెల్యేల సంగతి తర్వాత... కనీసం ఉమ్మడి వరంగల్ పరిధిలో ఇప్పుడున్న మిగిలిన ఐదు జిల్లాల డీసీసీ అధ్యక్షులు కూడా మినిస్టర్స్ మీద వస్తున్న ఇసుక ఆరోపణలపై ఎందుకు స్పందించడం లేదన్నది ఆలోచించాల్సిన విషయమేనని అంటున్నారు రాజకీయ పరిశీలకులు. ఇసుక తవ్వకాలకు సంబంధించిన అనుమతుల విషయంలో ఎక్కడా తప్పు జరగలేదని, మంత్రులు నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడా వ్యవహరించలేదని కాంగ్రెస్ నేతలు గట్టిగా ఎందుకు చెప్పలేకపోతున్నారన్న ప్రశ్నలు సైతం వస్తున్నాయి. ఇందుకు సమాధానంగా వినిపిస్తున్న కొన్ని మాటలు కాంగ్రెస్ పార్టీలోని ప్రస్తుత పరిస్థితి ప్రతిబింబిస్తున్నాయని అంటున్నారు పొలిటికల్ పండిట్స్. ఏం మాట్లాడితే ఏమవుతుందోనన్న భయంతోనే ఎక్కువ మంది కామ్‌గా ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. చేతిలో పూర్తి సమాచారం లేకుండా. ఏదో, మంత్రుల్ని వెనకేసుకుని రావాలి కాబట్టి నోటికొచ్చింది మాట్లాడేస్తే రేపు మనం ఇరుక్కుపోతామన్న భయం వాళ్ళలో ఉందట. అందుకే ఇసుక ఆరోపణల విషయంలో మంత్రులు ఇద్దరికీ బాసటగా నిలవలేకపోతున్నట్టు చెప్పుకుంటున్నారు. అలాగే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు మంత్రుల నుంచి కూడా మనం కరెక్ట్‌గానే ఉన్నాం, మీరు ఖండించండన్న గ్రీన్ సిగ్నల్ కూడా రాలేదని అంటున్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ అధిష్టానం సైతం ఈ విషయంపై నేతలకు క్లారిటీ ఇవ్వకపోవడం వల్ల ఇసుక దందా అంశాన్ని పట్టించుకోకుండా ఎవరికి వారు తమ పని తాము చేసుకుంటూ వెళ్తున్నారట. కానీ... విపక్షం ఆరోపణలు విస్తృతంగా ప్రజల్లోకి వెళ్ళక ముందే మేలుకుని ప్యాచ్‌వర్క్ చేయకుంటే నష్టపోవాల్సిన పరిస్థితులు వస్తాయన్న టెన్షన్ కాంగ్రెస్ వర్గాల్లో మొదలైంది.

# 10 రెస్టారెంట్లలో 9 దారుణం

అధికారులు గుర్తించారు. పైగా ప్యాకెట్ల మీద లేబుల్స్ కూడా లేవు.

**లులు హైపర్ మార్కెట్**

చెత్తబుట్టలో వేయాల్సిన 150 కిలోల ఆహారాన్ని ఇక్కడ అధికారులు గుర్తించారు. వెంటనే దానిని స్వాధీనం చేసుకున్నారు. డ్రైనేజీలు మొత్తం బ్లాక్ అయ్యాయి. అందులో పురుగులు ఉన్నాయి. గడువు ముగిసిన ఆహార పదార్థాలను గుర్తించిన అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

**ఉడిపి ఉపహార్ మూసాపేట్**

డ్రైనేజీలో దారుణంగా సమస్యలు ఉన్నాయి. పురుగులు ఎక్కడికక్కడ కనిపిస్తున్నాయి. చెత్తబుట్టల మీద మూతలు లేవు. వంట చేసేవారు సరైన జాగ్రత్తలు పాటించడం లేదు. లైసెన్స్ కూడా ముగిసిపోయింది.

**చౌమన్, మాదాపూర్**

ఇక్కడ మాంసాన్ని అత్యంత అపరిశుభ్రమైన వాతావరణంలో నిల్వ చేశారు. శాకాహారం.. మాంసాహారం కలిపి నిల్వ చేశారు. కనీసం వాటి మీద మూతలు కూడా పెట్టలేదు.

**జిస్మత్ జైల్ మండి, మదినగూడ**

ఇక్కడ వంటలు వండే తీరు ఎలా ఉందంటే.. కనీసం వాటిని పందులు కూడా తినవు. ఐటమ్స్కు లేబుల్స్ లేవు. సరైన నిలవలేదు. దీనికి ఎటువంటి గుర్తింపు లేదు. వాతావరణం అత్యంత దారుణంగా ఉంది.

**రాయల్ స్పైసి, గచ్చిబౌలి**

కీటకాలు తాండవం చేస్తున్నాయి. దుర్వాసన ముక్కులను పగలగొడుతోంది. నీరు దారుణంగా నిలిచిపోయింది. కిచెన్ అత్యంత అపరిశుభ్రంగా ఉంది. వంట కాదు కదా, ఇక్కడ ఐదు నిమిషాలు కూడా ఉండలేని పరిస్థితి.

**సబ్ వే, కొండాపూర్**



కుళ్ళిపోయిన కూరగాయలు వాడుతున్నారు. లేబుల్ లేని ఐటమ్స్ ఉపయోగిస్తున్నారు. సింక్ నిర్వహణ అత్యంత దారుణంగా ఉంది. ఆహార వృధా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.

**లాఫినోస్ పిజ్జా, జూబ్లీ ఎంక్లేవ్**

బొద్దింకలు స్వైర విహారం చేస్తున్నాయి. ఇతర రెక్కల పురుగులు ఇష్టమొచ్చినట్టు తిరుగుతున్నాయి. గడువు ముగిసిన ఆహార పదార్థాలు ఉపయోగిస్తున్నారు. అపరిశుభ్రత అత్యంత దారుణంగా ఉంది.

# తెలుగు ఎంపీలే రిచ్చెస్ట్

హైదరాబాద్ జూన్ 26, (వాయిస్ టుడే ) : అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం.. రాజ్యసభ సభ్యుల ఆస్తుల విలువలో తెలుగు రాష్ట్రాల ఎంపీలదే పైచేయిగా నిలిచింది. దేశవ్యాప్తంగా 226 మంది సిట్టింగ్ ఎంపీల మొత్తం ఆస్తుల విలువ రూ. 26,047 కోట్లు కాగా.. అందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 18 మంది ఎంపీల సంపదే 39.39 శాతం అంటే రూ. 10,259 కోట్లు ఉండటం గమనార్హం. ముఖ్యంగా తెలంగాణకు చెందిన ఏడుగురు ఎంపీల ఆస్తులు రూ. 8,310 కోట్లుగా ఉన్నాయి. బీఆర్ఎస్ ఎంపీ బండి పార్థసారథి రూ. 5300 కోట్లతో దేశంలోనే అత్యంత ధనిక ఎంపీగా నిలిచారు. అలాగే తెలంగాణ ఎంపీల్లో 71 శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు నివేదిక వెల్లడించింది.భారత పార్లమెంట్ ఎగువసభ అయిన రాజ్యసభలో తెలంగాణ ప్రజాప్రతినిధుల హవా నడుస్తోంది. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ దేశవ్యాప్తంగా ఉన్న 226 మంది సిట్టింగ్ రాజ్యసభ ఎంపీల ఆర్థిక, నేర, ఇతర నేపథ్యాలపై తాజాగా విడుదల చేసిన నివేదికలో కీలక విషయాలు వెల్లడయ్యాయి. దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం రాజ్యసభ సభ్యుల ఆస్తులతో పోలిస్తే.. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 18 మంది ఎంపీల వాటాయే ఏకంగా 39.39 శాతంగా నమోదైంది. ఈ మొత్తం సంపదలోనూ ఆంధ్రప్రదేశ్‌తో పోలిస్తే తెలంగాణ ఎంపీల ఆస్తులే ఎక్కువ.మొత్తం 226 మంది ఎంపీల ఆస్తుల విలువ రూ. 26,047 కోట్లు కాగా.. అందులో కేవలం తెలంగాణకు చెందిన ఏడుగురు ఎంపీల సంపదే ఏకంగా రూ. 8,310 కోట్లుగా ఉంది. అంటే దేశవ్యాప్త ఎంపీల మొత్తం ఆస్తిలో దాదాపు మూడో వంతు వాటా తెలంగాణ ప్రజాప్రతినిధులదే కావడం గమనార్హం. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 11 మంది ఎంపీల ఆస్తుల విలువ రూ. 1,949 కోట్లుగా ఉంది. నివేదిక ప్రకారం తెలంగాణలో 57 శాతం మంది, ఆంధ్రప్రదేశ్‌లో 45 శాతం మంది ఎంపీలు బిలియనీర్లుగా తేలారురాజ్యసభలో అత్యధిక ఆస్తులున్న తొలి ముగ్గురు ఎంపీలను పరిశీలిస్తే.. అందులో ఇద్దరు తెలంగాణ రాష్ట్రానికి చెందినవారే కావడం విశేషం. తెలంగాణ నుంచి బీఆర్ఎస్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న బండి పార్థసారథి రూ. 5,300 కోట్ల ఆస్తులతో దేశంలోనే అత్యంత ధనిక రాజ్యసభ ఎంపీగా మొదటి స్థానంలో నిలిచారు. పంజాబ్‌కు చెందిన బీజేపీ ఎంపీ రాజేందర్ గుప్తా రూ. 5,053 కోట్లతో రెండో స్థానంలో నిలవగా.. తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ రూ. 2,558 కోట్లతో మూడో స్థానాన్ని దక్కించుకున్నారు. తెలంగాణలో కేవలం ముగ్గురు బీఆర్ఎస్ సభ్యుల ఆస్తి విలువే రూ. 5,524 కోట్లుగా ఉందని ఏడీఆర్ స్పష్టం చేసింది.క్రిమినల్ కేసులు ఉన్న ఎంపీల జాబితాలోనూ తెలంగాణ రాష్ట్రం దేశంలోనే తొలి స్థానంలో నిలిచింది. తెలంగాణకు చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యుల్లో ఐదుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఇందులో ముగ్గురిపై అత్యంత తీవ్రమైన నేరాల కేసులు ఉన్నట్లు ఏడీఆర్ నివేదిక పేర్కొంది. ఈ కేసుల పరంగా దేశంలో మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, బిహార్, కేరళ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల కంటే తెలంగాణే ముందంజలో ఉంది. తెలంగాణలో క్రిమినల్ కేసులున్న వారిలో బీఆర్ఎస్ నుంచి ముగ్గురు, కాంగ్రెస్ నుంచి ఇద్దరు ఎంపీలు ఉన్నారు.దేశవ్యాప్తంగా వంద కోట్ల కంటే ఎక్కువ ఆస్తి ఉన్న ఎంపీలు 31 మంది ఉండగా.. అందులో బీజేపీ నుంచి ఏడుగురు, కాంగ్రెస్ నుంచి ఆరుగురు ఉన్నారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి టీడీపీ, వైసీపీ, బీఆర్ఎస్ నుంచి ఇద్దరేసి, జనసేన నుంచి ఒకరు ఈ వంద కోట్ల క్లబ్‌లో ఉన్నారు. పార్టీల పరంగా చూస్తే.. దేశవ్యాప్తంగా బీజేపీ ఎంపీల ఆస్తుల విలువ రూ. 8,181 కోట్లు కాగా.. కాంగ్రెస్ సభ్యులది రూ. 3,781 కోట్లుగా ఉంది. నలుగురు స్వతంత్రులకు రూ. 2,211 కోట్ల ఆస్తులున్నాయి. ఏపీలో టీడీపీకి చెందిన నలుగురు ఎంపీల ఆస్తుల విలువ రూ. 1,007 కోట్లు కాగా.. వైసీపీకి చెందిన నలుగురు సభ్యులకు రూ. 683 కోట్ల విలువైన ఆస్తులున్నాయి.అప్పుల విషయానికి వస్తే.. రాజ్యసభలో అత్యధిక అప్పులున్న తొలి ముగ్గురు ఎంపీల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టీడీపీ ఎంపీ భాష్యం రామకృష్ణ రూ. 200 కోట్ల అప్పులతో రెండో స్థానంలో నిలిచారు. ఆయన మట్నొత్తం ఆస్తులు రూ. 672 కోట్లు. ఝార్ఖండ్‌కు చెందిన స్వతంత్ర ఎంపీ పరిమళ్‌నత్వానీ రూ. 256 కోట్ల అప్పులతో మొదటి స్థానంలో.. జయాబచ్చన్ రూ. 149 కోట్ల అప్పులతో మూడో స్థానంలో ఉన్నారు. కాగా, మొత్తం రాజ్యసభ సభ్యుల్లో మహిళల వాటా కేవలం 15 శాతం అంటే 34 మంది మాత్రమే ఉన్నారని.. అందులోనూ బీజేపీ నుంచి 20 మంది, కాంగ్రెస్ నుంచి ఐదుగురు, తృణమూల్ కాంగ్రెస్ నుంచి నలుగురు ఉన్నట్లు ఏడీఆర్ తన నివేదికలో వెల్లడించింది.



## ప్రైవేట్ కాలేజీల యజమాన్యాలకు ఊరట

హైదరాబాద్, జూన్ 26, (వాయిస్ టుడే ) : తెలంగాణ హైకోర్టులో ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలకు స్వల్ప ఊరట లభించింది. విద్యార్థుల నుంచి ఫీజుల వసూళ్లు, ఫీజు రియింబర్స్‌మెంట్‌కు సంబంధించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో నంబర్ 9 లోని మార్గదర్శకాలపై హైకోర్టు స్టే విధిస్తూ.. మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోవడంతోపాటు.. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవద్దంటూ సర్కార్ తీసుకొచ్చిన జీవో 9పై ధర్మాసనం తీవ్రంగా మండిపడింది. వచ్చే మంగళవారం వరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని స్టే విధిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.జీవో నంబర్ 9ని సవాల్ చేస్తూ ప్రైవేటు కాలేజీలు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు .. రాష్ట్ర ప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధించింది. ప్రభుత్వం బకాయిలు చెల్లించకుండా.. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవద్దంటే యాజమాన్యాలు ప్రైవేటు కాలేజీలను ఎలా నడుపుతారని నిలదీసింది. అదే సమయంలో రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎంత బడ్జెట్ కేటాయించారని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. బడ్జెట్ సమావేశాలు కూడా అయిపోయాయని.. ఇంకా పెండింగ్ ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను ఎందుకు విడుదల చేయలేదని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు ఆగిపోవడంతో కాలేజీలను నడపడం కష్టంగా మారిందని.. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బందికి వేతనాలు చెల్లించడం కూడా కాలేజీలకు భారంగా మారిందని హైకోర్టు పేర్కొంది.ఈ క్రమంలోనే ప్రైవేటు కాలేజీలకు ఫీజు రీయంబర్స్‌మెంట్ కింద చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను ఎప్పటి లోగా చెల్లిస్తారో చెప్పారని హైకోర్టు ఆదేశించింది. ఈ ఏడాది ఆగస్ట్ 15వ తేదీ లోపు అన్ని బకాయిలను క్లియర్ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం తరపు వాదనలు వినిపించిన లాయర్ హైకోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన ప్రైవేటు కాలేజీల తరఫు వాదనలు వినిపిస్తున్న లాయర్.. ఆగస్టు 15వ తేదీ లోపు బకాయిలు మొత్తం క్లియర్ చేస్తే.. ఆరోజే తాము దాఖలు చేసిన పిటిషన్లను వెనక్కి తీసుకుంటామని హైకోర్టుకు విన్నవించారు.ఇక ఈ వ్యవహారంలో పలువురు విద్యార్థులు కూడా ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలకు మధ్య విద్యార్థులు తీవ్రంగా నలిగిపోతున్నారని విద్యార్థుల తరపు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. ఈ పెండింగ్ బకాయిల ద్వారా విద్యార్థులు నష్టపోకుండా చూడాలని కోర్టును కోరారు. ఈ ఏడాది కొత్తగా కాలేజీల్లో చేరే విద్యార్థులకే ఇది వర్తించేలా చూడాలని.. విజ్ఞప్తి చేశారు.

## డ్రగ్ ఫ్రీ తెలంగాణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి: సీఎం రేవంత్



హైదరాబాద్ : మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కోరారు. యువతలో సానుకూల ఆలోచనలు, విలువలు పెంపొందించి మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని "మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవం" సందర్భంగా ఒక సందేశంలో పేర్కొన్నారు. మాదక ద్రవ్యాలు వ్యక్తి జీవితాన్నే కాకుండా కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తాయని, తద్వారా సమాజంపై ప్రతికూల ప్రభావం చూపడంతో పాటు శాంతిభద్రతలకు సంబంధించిన సమస్యలకు దారితీస్తాయని అన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణ అక్రమ రవాణాను అరికట్టేందుకు అవగాహన, అప్రమత్తత, సామాజిక బాధ్యత ఎంతో అవసరమని పేర్కొన్నారు. డ్రగ్ ఫ్రీ తెలంగాణ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై సహకరించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

## ముదిరిన అయోధ్య రామమందిర కానుకల చోరీ కేసు

కానుకల లెక్కింపు, నగదు నిర్వహణ ప్రక్రియలో పాలుపంచుకున్న ఉద్యోగులేనని అర్థమవుతోంది. ఇది, వీరు వ్యవస్థలోని కింది స్థాయి వ్యక్తులు మాత్రమేనా, లేక ఈ వ్యవస్థ మొత్తం ఉన్నతాధికారుల ఆదేశాలు, రక్షణలో పనిచేస్తోందా అనే ప్రశ్నలను లేవనెత్తుతోంది.అధికారిక వర్గాల సమాచారం ప్రకారం, సిట్ ప్రాథమిక నివేదిక ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌ను అనుమానితుడిగా గుర్తించింది. ఈ నివేదిక సిబ్బంది నియామక ప్రక్రియపై కూడా తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. చాలా మంది ఉద్యోగులు ఎలాంటి లిఖితపూర్వక నియామక ఉత్తర్వులు లేకుండా పనిచేస్తున్నారని, వారి నేపథ్యాలను సరిగ్గా ధృవీకరించలేదని అందులో పేర్కొన్నారు. డొనేషన్స్ లెక్కింపు, పర్యవేక్షణ, నమోదు, భద్రతా ఏర్పాట్లలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని కూడా విచారణలో తేలింది. ఇది మొత్తం వ్యవస్థ పారదర్శకతపై ప్రశ్నలను లేవనెత్తుతోంది. విచారణలో భాగంగా చంపత్ రాయ్, అనిల్ మిశ్రాను కూడా ప్రశ్నించారు. విచారణ సమయంలో చంపత్ రాయ్‌ను అనేక ముఖ్యమైన ప్రశ్నలు సిట్ అడిగింది. విరాళాలను లెక్కించే బాధ్యత గల ఉద్యోగులు ఎవరు? ఈ ఉద్యోగులను ఎవరు నియమించారు? విరాళాల పెట్టె నుంచి డబ్బును తీయడం, దానిని లెక్కించడం, బ్యాంకులో జమ చేసే ప్రక్రియ ఎలా జరుగుతుంది? సిసిటివి, రికార్డింగ్, భద్రతా ఏర్పాట్లు ఎలా ఉన్నాయి? ఉద్యోగులు బయటకు వెళ్లేటప్పుడు వారిని తనిఖీ చేశారా? లేదా అని గ్రిల్ చేశారు. అంతే కాకుండా నగదు లెక్కింపు సమయంలో ఆయన హాజరు, ఉద్యోగుల ధృవీకరణ, సీసీటీవీ కెమెరాల పనితీరు, వాటిని ఎప్పుడైనా ఆపివేశారా, నగదు లెక్కల్లో మరెవరు పాలుపంచుకున్నారు వంటి ఎనిమిది కీలక ప్రశ్నలను కూడా సిట్ ట్రస్ట్ సభ్యుడు అనిల్ మిశ్రాను అడిగింది.ఆలయ నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్రా, నిబంధనలు పాటించి ఉంటే ఈ పరిస్థితి తలెత్తి ఉండేది కాదని గతంలోనే అంగీకరించారు. ఏబీపీ న్యూస్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో, పర్యవేక్షణ దాదాపుగా లేదని, పరిపాలనా నిర్వహణ అనుభవం తీవ్రంగా కొరవడిందని పేర్కొన్నారు. వ్యవస్థను నిర్వహించడానికి స్వతంత్ర అధికారం కలిగిన ఒక అనుభవజ్ఞుడైన పరిపాలనా అధికారిని ట్రస్ట్ కింద నియమించాలని ఆయన సూచించారు.

## ఎట్టకేలకు వై. శ్రీలక్ష్మికి ప్రభుత్వం పోస్టింగ్

తెలంగాణ కేడర్‌కు కేటాయించారు. అయితే, ఏపీలో జగన్ అధికారంలోకి వచ్చాక.. ఏపీకి వచ్చేందుకు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ను ఆశ్రయించారు. క్యాట్ ఆదేశాల ద్వారా తెలంగాణ నుండి ఏపీ కేడర్‌లోకి బదిలీ చేయించుకున్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఆమెకు విపరీతమైన ప్రాధాన్యత దక్కింది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఆమె సచివాలయంలో చక్రం తిప్పారు. జగన్ హయాంలోనే ఆమెకు వరుస ప్రమోషన్లు లభించి బ్యూరోక్రసీలో టాప్ పొజిషన్‌కు చేరుకున్నారు.ఐఏఎస్ వై. శ్రీలక్ష్మి సుదీర్ఘ కెరీర్ ఎంత వైభవంగా సాగిందో.. దానికి రెట్టింపు స్థాయిలో పెను వివాదాలు, లీగల్ ఇబ్బందులు ఆమెను చుట్టుముట్టాయి. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో జరిగిన ఓబుళాపురం మైనింగ్ కంపెనీ అక్రమ మైనింగ్ కేసులో ఆమె తీవ్ర చట్టపరమైన ఇబ్బందులను ఎదుర్కొన్నారు. నాటి మైనింగ్ శాఖ కార్యదర్శిగా ఉన్న శ్రీలక్ష్మి నిబంధనలకు విరుద్ధంగా గాలి జనార్దన్ రెడ్డికి అనుకూలంగా జీవోలు ఇచ్చారనే ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఆమెను అరెస్ట్ చేసింది. ఈ కేసుల వల్ల ఆమె ఐఏఎస్ సర్వీసు నుండి సస్పెండ్ అవ్వడమే కాకుండా, చంచల్‌గూడ జైల్లో సుదీర్ఘ కాలం రిమాండ్ ఖైదీగా జైలు శిక్షను కూడా అనుభవించాల్సి వచ్చింది. జగన్ అక్రమాస్తుల కేసుల్లో సైతం ఆమె పేరు ప్రముఖంగా వినపడింది.ఆమెపై ఇప్పటికీ పలు కోర్టు కేసులు, తీవ్రమైన అవినీతి ఆరోపణలు నడుస్తున్నప్పటికీ.. వాటన్నింటినీ పక్కనబెట్టి, రిటైర్మెంట్‌కు కేవలం నాలుగు రోజుల ముందు ప్రభుత్వం ఆమె సీనియారిటీని గౌరవించింది. సచివాలయంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన, అధికారుల బదిలీలను చూసే జీఏడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బాధ్యతలను అప్పగించడం ద్వారా ఆమె ఐఏఎస్ కెరీర్‌కు ఒక సాఫీ ముగింపును ఇచ్చే ప్రయత్నం చంద్రబాబు సర్కార్ చేసింది.

## అడ్డంగా బుక్కైన సీఐ నాగరాజు

లాకప్ డెలిత్ గా బయటపడింది. సీఐ రిమాండ్ రిపోర్టులో అత్యా అని తేల్చేసింది సిట్. పోలీస్ కస్టడీలో తగిలిన గాయాల వల్లే సాయి కృష్ణ మరణం సంభవించిందని నిర్ధారించింది. దీంతో కుటుంబ సభ్యుల అనుమానాలు నిజమయ్యాయి. అయితే సాయి కృష్ణ మృతదేహాన్ని ఖననం చేశారా? లేకుంటే ఎక్కడైనా విడిచి పెట్టారా? అన్నది తెలియాల్సి ఉంది.అయితే సాయి కృష్ణ తల్లి విజయలక్ష్మి తన కుమారుడిని చంపేశారు అంటూ ఆది నుంచి ఆరోపిస్తున్నారు. కచ్చితంగా ఆనవాళ్లు, అనుమానాలు ఉండడంతో పాటు సంకేతాలు రావడంతోనే ఆమె ఆ తరహా ఆరోపణలు చేశారని ఇప్పుడు అర్థం అవుతోంది. సాయి కృష్ణ మే 6న మార్కాపురంలో టాస్క్ ఫోర్స్ సిబ్బందికి పట్టుబడ్డారు. కృష్ణలంక పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఇక్కడే నిందితుడిగా భావిస్తున్న సిఐ నాగరాజు వ్యూహాత్మకంగా అడుగులు వేసినట్లు అర్థం అవుతుంది. మే 1 నుంచి జూన్ 1 వరకు కృష్ణలంక పోలీస్ స్టేషన్లో ఉన్న సీసీటీవీ ఫుటేజ్ పూర్తిగా మాయమైంది. అయితే ఇప్పటివరకు అదృశ్యం కేసు గానే ఉండేది. ఇప్పుడు లాకప్ డెలిత్ అని తెలియడంతో దాని వెనుక జరిగిన పరిణామాలపై అసలు సిసలైన విచారణ మొదలుకానుంది.అసలు సాయి కృష్ణ పై మోపిన అభియోగాలు ఏంటి? ఏ కేసులో టాస్క్ ఫోర్స్ పోలీసులు సాయికృష్ణను అదుపులోకి తీసుకున్నారు? సీఐ నాగరాజుకు సరెండర్ చేసిన తర్వాత ఏం జరిగింది? అసలు లాకప్ డెలిత్ చేయాల్సిన అవసరం సిఐ నాగరాజుకు ఎందుకు వచ్చింది? దీని వెనుక పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నాయా? లేకుంటే పెద్దల పాత్ర వుందా? ఒక నిందితుడిని అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరు పరచకుండా ఎందుకలా చేశారు? అన్నింటికీ మించి సాయి కృష్ణ మృతదేహం ఇప్పుడు ఎక్కడ ఉంది? ఖననం చేశారా? దహనం చేశారా? లేకుంటే ఎక్కడైనా పారవేశారా? అనేది ఇప్పుడు రెండో చార్ట్ షీట్లో తప్పకుండా వెల్లడయ్యే అవకాశం ఉంది. అయితే ఈ కేసు వెనుక ఏం జరిగిందనే దానిపై పోలీసు వర్గాలకు ఇప్పటికే ఒక స్పష్టత ఉంది. ఎందుకంటే మృతుడు సాయి కృష్ణకు నేరచరిత ఉంది. అయితే నేరస్తులంతా లాకప్ డెలిత్ చేస్తామంటే కుదరదు. అయితే ఈ స్థాయికి పరిస్థితి వచ్చింది అంటే తెర వెనుక ఏం జరిగింది అనేది ఇప్పుడు కచ్చితంగా బయటపడుతుంది. అంతవరకు వేచి చూడాల్సిందే.

# జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

**ప్రైవేటు, కార్పొరేటు ఆస్పత్రుల్లో అమలయ్యేలా హెల్త్ కార్డులను పునరుద్ధరించాలి**

**హెచ్యూజే (టీడబ్ల్యూజేఎఫ్) కార్యవర్గం డిమాండ్**



సికింద్రాబాద్, జూన్ 26 (వాయిస్ టుడే ప్రతినిధి): హైదరాబాద్‌లోని జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ (హెచ్యూజే - టీడబ్ల్యూజేఎఫ్) కార్యవర్గం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరింది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో హెచ్ యూజే అధ్యక్షుడు బి. అరుణ్ కుమార్ అధ్యక్షతన ఆ సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, ఇతర సమస్యలపై నాయకులు కూలంకుషంగా చర్చించారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందని తెలిపింది. ఇండ్ల స్థలాలకు సంబంధించి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం జాప్యం చేయకుండా నివేదికను రూపొందించి ప్రభుత్వానికి అందజేయాలని కోరింది. న్యాయపరమైన చిక్కులు లేకుండా జర్నలిస్టులకు న్యాయం చేసేలా నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు అన్ని ప్రయివేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యచికిత్సలు అందేలా హెల్త్ కార్డులను పునరుద్ధరించాలని డిమాండ్ చేసింది. ముఖ్యఅతిథిగా హాజరైన టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, అడ్ హక్ కమిటీ కన్వీనర్ పిల్లి రాంచందర్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ వాటి పరిష్కారానికి హెచ్యూజే నాయకులు కృషి చేయాలన్నారు. సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నిర్మాణాన్ని బలోపేతం చేసుకోవాలని సూచించారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఈ చంద్రశేఖర్ మాట్లాడుతూ జర్నలిస్టులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వాటి పరిష్కారం కోసం హెచ్ యూజే కార్యాచరణను రూపొందించాలని కోరారు. సమస్యలను ప్రభుత్వం తీసుకెళ్లాలని సూచించారు.

హెచ్యూజే అధ్యక్షులు బి అరుణ్ కుమార్, కార్యదర్శి బి జగదీశ్వర్ మాట్లాడుతూ సంఘం కార్యక్రమాలను వివరించారు. హెచ్ యూజే సభ్యత్వ నమోదు ప్రక్రియను పూర్తిచేసి ఆగస్టు చివరి వారంలో సంఘం మహాసభ నిర్వహిస్తామని చెప్పారు. జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించి వాటిని పరిష్కరించాలని కోరారు. హైదరాబాద్ లో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హెచ్ యూజే వర్కింగ్ ప్రెసిడెంట్ గంద్ర నవీన్ , కోశాధికారి బి రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలపై హెచ్ యూజే, టీడబ్ల్యూజేఎఫ్ సంఘాలు మాత్రమే చిత్తశుద్ధితో పనిచేస్తున్నాయని అన్నారు. నియోజకవర్గ మహాసభలు పూర్తి చేసుకుని ఆగస్టు చివరి నాటికి హెచ్ యూజే మహాసభ నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్ యూజే ఆఫీస్ బేరర్లు సర్వేశ్వరరావు, మధుకర్, ప్రశాంత్, రేణయ్య, మాధవ రెడ్డి, తలారి శ్రీనివాస్, వి సాగర్, జె క్రాంతి, పి విజయ, శ్రీధర్ మురహరి, రాము తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి పద్ధతి మార్చుకోవాలి

**బచ్చాగాళ్ళతో లేనిపోనివి మాట్లాడిపిస్తే ఖబర్దార్**

**మచ్చలేని మధుయాష్కి గౌడ్ పై లేనిపోని ఆరోపణ చేస్తే సహించేది లేదు**

**ఎల్బీనగర్ సీనియర్ కాంగ్రెస్ నేత దేరంగుల కృష్ణ**



ఎల్ బి నగర్ జూన్ 26(వాయిస్ టుడే ): నిరంతరం బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం, ఎల్బీనగర్ ప్రజల అభివృద్ధి కోసం పనిచేస్తున్న మచ్చలేని మధుయాష్కి గౌడ్ పై ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి ఆయన అనుచరులతో మధుయాష్కి గౌడ్ పై లేని పోనీ ఆరోపణ చేయడం తీవ్రంగా ఖండిస్తున్నానని ఎల్బీనగర్ సీనియర్ కాంగ్రెస్ నేత పీసీసీ మాజీ కార్యదర్శి దేరంగుల కృష్ణ అన్నారు. చెరువు అభివృద్ధి విషయంలో పర్యటించిన మధుయాష్కి గౌడ్ పై దేవి రెడ్డి సుధీర్ రెడ్డి తన అంచర్లతో లేనిపోని ఆరోపణలు చేయించడం సరికాదని అన్నారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవీ రెడ్డి సుధీర్ రెడ్డి, స్థానిక బారాస నాయకుడు గజ్జల మధుసూదన్ రెడ్డి లు కలిసి బైరాములగూడ చెరువుతోపాటు భూపేష్ గుప్తా నగర్ చేపల చెరువును కూడా కబ్జా చేశారని ఆరోపించారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవీ రెడ్డి సుధీర్ రెడ్డి చేసిన చెరువు కబ్జాల గురించి ఎల్బీనగర్ ప్రజలందరికీ తెలుసునని రానున్న రోజుల్లో సుధీర్ రెడ్డికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఆయన అన్నారు. ప్రభుత్వ భూమి నే ప్రభుత్వానికి అమ్మిన ఘనులు వీరని ఆయన అన్నారు. ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి పై గజ్జల మధుసూదన్ రెడ్డి పై పూర్తి విచారణ చేపడితే వారి భూకబ్జాలు భాగోతాలు బయటికి వస్తాయని అన్నారు. ఒక్క చెరువును పరిశీలిస్తేనే ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి వనికి పోతున్నారని ఎద్దేవ చేశారు. ఎమ్మెల్యే దేవీ రెడ్డి సుధీర్ రెడ్డి భూకబ్జా బాగోతాలు అక్రమాలు అన్ని బయటికి తీస్తామని అన్నారు.మచ్చలేని మధుయాష్ కి గౌడ్ పై లేనిపోని ఆరోపణలు చేస్తే ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డికి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఇకనైనా ఆయన పద్ధతి మార్చుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే దేవీ రెడ్డి సుధీర్ రెడ్డి బాగోతాలు ఒక్కొక్కటిగా అన్ని బయటకు తీస్తామని తెలిపారు.



## బీఎల్‌వోలు వెంటనే విధులకు హాజరు కావాలి

**మేకల సారంగపాణి**

సికింద్రాబాద్, జూన్ 26 (వాయిస్ టుడే ప్రతినిధి): ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ పలుచోట్ల బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) విధులకు హాజరు కావడం లేదని, దీనిపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కంటెస్టెడ్ ఎమ్మెల్యే మేకల సారంగపాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మెట్టుగూడ డివిజన్‌లోని పలు పోలింగ్ బూత్‌లను సందర్శించి ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ, విధులకు గైర్హాజరవుతున్న బీఎల్‌వోలను వెంటనే విధుల్లోకి తీసుకురావాలని, లేకుంటే వారి స్థానంలో ఇతరులను నియమించాలని అధికారులను కోరారు. స్పందన లేకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా, పారదర్శకంగా నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మేకల సారంగపాణి అన్నారు. నిర్ణీత నెల రోజుల వ్యవధిలో ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉన్నందున సమయపాలన పాటిస్తూ అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మెట్టుగూడ డివిజన్ అధ్యక్షుడు ఆదర్శ్ ముదిరాజ్, నరేష్ మాదిగ, యుద్ధ వీర్, రమేష్, అంజన్న పాల్గొన్నారు.

## ప్రారంభం రోజే పరికరానికి పగులు

**ఇందిరా పార్క్ ఓపెన్ జిమ్‌లో నాణ్యతా లోపాలు**



సికింద్రాబాద్, జూన్ 26 (వాయిస్ టుడే ప్రతినిధి): ముషీరాబాద్‌లోని కావడిగూడ ఇందిరా పార్క్‌లో శుక్రవారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించిన ఓపెన్ జిమ్‌లో నాణ్యతా లోపాలపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రారంభోత్సవం జరిగిన కొద్ది సేపటికే ఓ జిమ్ పరికరం ఇనుప పైపు జాయింట్ వద్ద పగులు కనిపించడంతో నిర్మాణ పనుల నాణ్యతపై ప్రశ్నలు తలెత్తాయి. స్థానికుల కథనం ప్రకారం, వ్యాయామం కోసం ఏర్పాటు చేసిన ప్రధాన పరికరాల్లో ఒకటి వెల్డింగ్ చేసిన భాగం వద్ద నిలువుగా చీలిక ఏర్పడింది. దీంతో నాసిరకం మెటీరియల్ వాడారా? లేదా పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టలేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రారంభోత్సవం కోసం పూలమాలలతో అలంకరించిన జిమ్ పరికరాలు వాస్తవానికి భద్రతా ప్రమాణాలను పాటించలేదని మార్నింగ్ వాకర్స్ ఆరోపిస్తున్నారు. ఎవరైనా వ్యాయామం చేస్తున్న సమయంలో పరికరం పూర్తిగా విరిగిపోతే తీవ్ర ప్రమాదం జరిగే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే స్పందించి, పగులు వచ్చిన పరికరంతో పాటు మిగతా అన్ని జిమ్ పరికరాల నాణ్యతను సమగ్రంగా పరిశీలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే పనులు చేపట్టిన కాంట్రాక్టర్ బాధ్యతను నిర్ధారించి, నాణ్యతా లోపాలు తేలితే తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## బాచుపల్లి కౌసల్య కాలనీలో ద్వారక మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ

**– ముఖ్య అతిథిగా కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి**



కుత్బుల్లాపూర్ జూన్ 26(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని బాచుపల్లి కౌసల్య కాలనీలో ద్వారక మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు ఇందిరమ్మ చీరలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహిళల సంక్షేమం మరియు సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మహిళల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా కృషి కొనసాగుతోందన్నారు. ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ద్వారా మహిళల్లో ఆనందం మరియు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తూ సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో మహిళల పాత్రను మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ద్వారక గ్రామ అధ్యక్షురాలు ఇందిరా కడియాల, వైస్ ప్రెసిడెంట్ శ్రీదేవి, యశోద ఆర్.పీ. కరుణ, ఆర్.పీ. జ్యోతి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తిరుపతి రెడ్డి మరియు కాలనీ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సూరారం డివిజన్‌లో ఎస్ఐఆర్ ఓటరు నమోదు వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభం

**ప్రజలకు అవగాహన కల్పించిన మంత్రి సత్యనారాయణ, పుప్పాల భాస్కర్**



కుత్బుల్లాపూర్ జూన్ 26(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని 129 సూరారం డివిజన్లో పలు బస్తీలలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ( ఎస్ఐఆర్ ) వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ సందర్భంగా స్థానిక మాజీ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్లు ( బి ఎల్ ఓ లు), బూత్ లెవల్ ఏజెంట్లు ( బి ఎల్ ఏ లు)తో కలిసి వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఓటరు మహాశయులకు ఓటరు జాబితాలో పేర్ల నమోదు, చిరునామా మార్పు, పేరు, వయస్సు, ఇతర వివరాల సవరణ, కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునే విధానం, అవసరమైన పత్రాలు, వెరిఫికేషన్ ప్రక్రియ తదితర అంశాలపై ప్రజలకు సమగ్రంగా వివరించి అవగాహన కల్పించారు.



## ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం

బోడుప్పల్, వాయిస్ టుడే న్యూస్, జూన్ 26 : స్పెషల్ ఇంటెన్సివే రెవిజన్ - సర్ లో భాగంగా శుక్రవారం బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎ. శైలజ చెంగిచెర్ల వార్డు పరిధిలోని పలు ప్రాంతాలను సందర్శించారు.ఈ సందర్భంగా ఎన్నికల ఇన్‌చార్జ్ మోహన్‌రావుతో కలిసి బూత్‌లను పరిశీలించి, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సమీక్షించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు అవసరమైన అవగాహన కల్పిస్తూ సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది, బూత్ లెవల్ అధికారులు బి.ఎల్.ఓ లు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




## దేశంలోని గ్రామీణ బ్యాంకులను విలీనం చేసి, ఒకే జాతీయ గ్రామీణ బ్యాంకు ఏర్పాటు చేయాలి: వెంకటేశ్వర్ రెడ్డి

సికింద్రాబాద్, జూన్ 26 (వాయిస్ టుడే ప్రతినిధి): దేశవ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామీణ బ్యాంకులను విలీనం చేసి ఒకే జాతీయ గ్రామీణ బ్యాంకును ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా రీజనల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గ్రామీణ బ్యాంకుల్లో ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులను శాశ్వత ప్రాతిపదికన నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈమెరకు శుక్రవారం బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశం ఏపీ టీఆర్ఆర్‌బీఈ అధ్యక్షుడు బి. రవికాంత్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల పదోన్నతులను స్పాన్సర్ బ్యాంకుల్లో అమలవుతున్న విధానంలోనే అమలు చేయాలని కోరారు. అలాగే దేశంలోని 28 రాష్ట్రాల్లో ఉన్న గ్రామీణ బ్యాంకులను విలీనం చేసి ఒకే జాతీయ గ్రామీణ బ్యాంకును ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి. వేణు రావు, ప్రధాన కార్యదర్శిగా ఆకుల బాపు, కోశాధికారిగా టి. సతీష్ ఎన్నికయ్యారు. సమావేశంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్మన్ ప్రతాప్ రెడ్డి పాల్గొని నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా రీజనల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు సి. రాజీవన్, తెలంగాణ గ్రామీణ బ్యాంకు జనరల్ మేనేజర్ (హెచ్ఆర్, ఐటీ, బోర్డు) ఎస్. శంకరరావు, ఎన్ఎఫ్ఆర్ఆర్‌బీఈ అధ్యక్షుడు అశ్వత్, ఉపాధ్యక్షుడు శివకుమార్ బేగ్లూర్, ప్రధాన కార్యదర్శి సమీరన్ మెధి తదితరులు పాల్గొన్నారు.

## పార్కులు ప్రజల ఆరోగ్యానికి.. భవిష్యత్ తరాల ఆనందానికి చిరునామా..

**పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..**

**అమీన్పూర్ డివిజన్ పరిధిలో ఒక కోటి 51 లక్షల రూపాయలతో మూడు పార్కుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జిఎంఆర్**



అమీన్పూర్ (వాయిస్ టుడే) : పార్కులు ప్రజల ఆరోగ్యానికి. భవిష్యత్తు తరాల ఆనందానికి చిరునామాగా నిలుస్తాయని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం అమీన్పూర్ డివిజన్ పరిధిలోని పీజేఆర్ కాలనీ, హెచ్ఎంటి శిల్ప లేఔట్ కాలనీ, పిఎన్ఆర్ కాలనీలలో ఒక కోటి 51 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న పార్కుల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని తొమ్మిది డివిజన్లలో గల ప్రతి పార్కు అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. పార్కుల అభివృద్ధి ద్వారా ప్రజలకు ఆహ్లాద వాతావరణంలో పాటు పచ్చదనం పెరగడంతో పాటు కాలనీలలో స్వచ్ఛమైన గాలి లభిస్తుందని తెలిపారు. ప్రతి పార్కులో పిల్లలకు ఆట వస్తువులు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, ఇంజనీరింగ్ సురేష్, డి ఈ వెంకటరమణ, పార్కుల విభాగం మేనేజర్ సతీష్, మాజీ కౌన్సిలర్లు ఉపేందర్ రెడ్డి, గోపాల్, జగదీష్, కృష్ణ, మహదేవ రెడ్డి, రాములు, బిజిలి రాజు, కాట సునీత, మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

RNI No: TGTEL/25/A2649 VOICE OF PRAJALU
వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం.. తెలుగు దినపత్రిక



# నేషనల్ రూరల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగా ఏర్పాటు చేయాలి






## కేంద్ర ప్రభుత్వం బ్యాంకు ఉద్యోగులను పర్మినెంట్ చేసి పదోన్నతులు కల్పించాలి

## ఆల్ ఇండియా రీజినల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి

నాచారం (వాయిస్ టుడే): దేశవ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామీణ బ్యాంకులను కలిపి నేషనల్ రూరల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా రీజినల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. గ్రామీణ బ్యాంకులో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులను శాశ్వత ప్రతిపాదికన పర్మనెంట్ చేసి ఇతర ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం బాగ్ లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎస్ వెంకటేశ్వర్ రెడ్డి, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ ప్రతాపరెడ్డి, రాజీవ్ హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రజలకు రైతులకు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సేవలలు ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందన్నారు. దేశవ్యాప్తంగా ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల హక్కులను సమస్యలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఉద్యోగులకు పెన్షన్ సమానత్వం నియామకాలు సరిపడా మానవ వనరులు ప్రమోషన్ విధానాల సవరణ మెరుగైన సేవ నిబంధనలు దీర్ఘకాలికంగా పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగుల రెగ్యులరైజేషన్ తదితర డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా పి వేణు రావు, ఆకుల బాపు, ట్రెజరర్ గా సతీష్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, యెల్లంకి శ్రీనివాస్, వెంకటరమణ, రవికుమార్, అనిల్, డి శ్రీనివాస్, జె రాంబాబు, నాగయ్య, శ్రీకాంత్ తోపాటు రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ బ్యాంక్ ఉద్యోగులు యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మొహర్రం పండుగ కార్యక్రమంలో పాల్గొన్న పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి

పటాన్ చెరు (వాయిస్ టుడే న్యూస్) : పటాన్‌చెరు నియోజకవర్గంలోని రామచంద్రాపురంలో నిర్వహించిన పవిత్ర మొహర్రం కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి పాల్గొని ముస్లిం సోదరులకు మొహర్రం సందర్భంగా తన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొహర్రం త్యాగం, ధర్మం, న్యాయం, మానవతా విలువలకు ప్రతీక అని పేర్కొన్నారు. సమాజంలో సోదరభావం, ఐక్యత, పరస్పర గౌరవాన్ని పెంపొందించే ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్, రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తోంట అంజయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పరమేశ్ యాదవ్, స్థానిక ప్రజాప్రతినిధులు, ముస్లిం పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బోరంపేట్ డివిజన్లో ప్రారంభమైన ఎస్ ఐ ఆర్

కుత్బుల్లాపూర్ జూన్ 26(వాయిస్ టుడే): ఈ సందర్భంగా ఓటరు సవరణ ప్రక్రియలో ప్రతి ఓటరు అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం చేస్తే ఓటు జాబితా నుండి పేరు తొలగిపోయే అవకాశం ఉంటుందని ప్రజలకు వివరించడం జరిగింది. బిఎల్ఓ లు అందజేసే ఎన్యూమరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా పూర్తి చేసి తిరిగి సమర్పించాలని, అలా చేసినప్పుడే ఓటరు హక్కు పరిరక్షించబడుతుందని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అర్కల విజయ్ గౌడ్,పోచి మహేష్ ముదిరాజ్, చింతకింది సురేష్లినారాయణ,సాల్మన్ రాజు,బైండ్ల దయానంద్, హేమలత, కమలమ్మ, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.



## ఓటరు జాబితా సవరణపై కాంగ్రెస్ నాయకులకు అవగాహన సమావేశం నిర్వహించిన బండి రమేష్

కూకట్‌పల్లి, జూన్ 26(వాయిస్ టుడే) శుక్రవారం కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం శ్రీ హేమదుర్గా భవన్లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై పార్టీ బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా బ్లాక్ అధ్యక్షురాళ్లు, డివిజన్ మహిళా అధ్యక్షురాళ్లతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ నాయకులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో నాయకులు అప్రమత్తంగా వ్యవహరించాలని, ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల విషయంలో ప్రజలకు పూర్తి సహకారం అందించాలని సూచించారు. ప్రతి అర్హుడి ఓటు నమోదయ్యేలా ప్రతి డివిజన్‌లో నాయకులు బాధ్యతాయుతంగా పనిచేయాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే నాయకులపై పార్టీ పరంగా తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని బండి రమేష్ పిలుపునిచ్చారు.

## ఘనంగా బీజేవైఎం నాయకుడు భాస్కర్ రావు జన్మదిన వేడుకలు



కూకట్‌పల్లి, జూన్ 26(వాయిస్ టుడే): మూసాపేట్‌లో బీజేవైఎం కూకట్‌పల్లి నాయకుడు భాస్కర్ రావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మూసాపేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్, కోడిచెర్ల వినోద్ కుమార్, కందుకూరి తిరుపతి, జీవన్ యాదవ్, శేష మఠం నవీన్, సురేష్, శ్రీనివాస్ చారి, కోటి, బీజేవైఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి క్రాంతి కుమార్, ఎస్టీ మోర్చా నాయకుడు రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భాస్కర్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ కేక్ కట్ చేసి, ఆయనకు దీర్ఘాయుష్షు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమం ఆప్యాయ వాతావరణంలో ఘనంగా ముగిసింది.



## పీర్లను సందర్శించి ప్రార్థనలు చేసిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్

జూబ్లీహిల్స్, జూన్ 26 (వాయిస్ టుడే ): మొహర్రం సందర్భంగా అమీర్‌పేట్‌లోని సయ్యదుల్ చౌదాయే కర్బాలలో ఏర్పాటు చేసిన పీర్ల సమాగమాన్ని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతి, సామరస్యం నెలకొని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్, జావీద్, సయ్యద్ మజీద్ తదితరులు పాల్గొని పీర్లను సందర్శించి నివాళులు అర్పించారు. మొహర్రం సందర్భంగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయని వారు పేర్కొన్నారు.



## ఐడీపీఎల్ స్థలం కేటాయించి రోడ్డు నిర్మాణం చేపట్టాలి

### ఎంపీ ఈటెల రాజేందర్‌కు బీజేపీ నాయకుల వినతి

కూకట్‌పల్లి, జూన్ 26(వాయిస్ టుడే): శుక్రవారం మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని రంగారెడ్డి నగర్ డివిజన్‌లో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం రంగారెడ్డి నగర్‌లోని పంచశీల కాలనీ డబుల్ రోడ్డు నుంచి ప్రశాంత్ నగర్ వై-జంక్షన్ డబుల్ రోడ్డు వరకు రహదారి నిర్మాణానికి మధ్యలో ఉన్న ఐడీపీఎల్ స్థలాన్ని కేటాయించాలని బీజేపీ సీనియర్ నాయకుడు నందనము దివాకర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యంజాల పద్మయ్య ఎంపీ ఈటెల రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిని పరిశీలించిన ఎంపీ ఈటెల రాజేందర్, రోడ్డు నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు సంబంధిత కేంద్ర మంత్రితో మాట్లాడతానని హామీ ఇచ్చారు. అనంతరం నాయకులతో కలిసి ఐడీపీఎల్ స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు మణికంఠ, శేఖర్ యాదవ్, బక్క శంకర్ రెడ్డి, సందీప్, సుబ్బారావు, శేషగిరి, శ్రీనివాస్ గౌడ్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



## అంబికా ఫ్యాషన్ డిజైన్ మిషన్‌ను ప్రారంభించిన రాగిరి టింకు గౌడ్

కంటోన్మెంట్: జూన్ 26 (వాయిస్ టుడే ప్రతినిధి): మహిళలు వ్యాపారంలో రాణించాలని టింకు గౌడ్ అన్నారు శుక్రవారం బోయిన్పల్లి చిన్న తోకట్ట లో నూతనంగా ఏర్పాటు చేసిన అంబికా ఫ్యాషన్స్ డిజైన్ డిటిఫ్ ఫ్యాబ్రిక్,ప్రింటింగ్ మిషన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ యువ నాయకుడు రాగిరి టింకు గౌడ్ హాజరై ప్రారంభించారు. అనంతరం అంబికా ఫ్యాషన్ డిజైన్ యాజమాన్యం ఆయనను ఘనంగా శాలువాతో సత్కరించి సన్మానించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ప్రభుత్వ పథకాలపై ఆధారపడకుండా సొంత నిధులతో ఇలాంటి చిన్నచిన్న వ్యాపారాలు స్థాపించుకొని ఆర్థికంగా మరింత బలపడాలని అన్నారు. రానున్న రోజుల్లో ఇలాంటి ప్రింటింగ్ మరియు డిజైన్ మిషన్ల సంఖ్యను పెంచుతూ మీ వ్యాపారాన్ని విస్తరింప చేసుకొని పేద, మధ్యతరగతి మహిళలకు ఉపాధి కల్పించే విధంగా తోడ్పడాలని ఆయన యాజమాన్యానికి సూచించారుఈ కార్యక్రమంలో యష్పాల్, విజయలక్ష్మి, అంబికా, ర్వుర్ధిక,తదితరులు పాల్గొన్నారు.



## భరత్ నగర్ కాలనీలో ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ

### - కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డి

కూకట్‌పల్లి, జూన్ 26(వాయిస్ టుడే): కూకట్‌పల్లి నియోజకవర్గంలోని భరత్ నగర్ కాలనీలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భరత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు నాగేశ్వర్ రావు, బాబు, నరేష్ కుమార్, మధు, మూర్తి, భిక్షపతి గౌడ్, రాంబాబు, కవిత, అనూష, అశ్విని, జేజమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు ఇందిరమ్మ మహిళా శక్తి చీరలను పంపిణీ చేశారు. గత ప్రభుత్వం అందించిన చీరలతో పోలిస్తే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న చీరల నాణ్యత ఎంతో మెరుగ్గా ఉందని, చాలా అందంగా ఉన్నాయని మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమానికి కట్టుబడి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రతి కుటుంబానికి చేరుతున్నాయని నిర్వాహకులు తెలిపారు.



## SIRలో భాగంగా తార్నాక డివిజన్ లో ఓటర్లకు ఎమ్యూనరేషన్ ఫార్మ్‌లు పంపిణీ

## బీ ఆర్ ఎస్ సీనియర్ నాయకురాలు మురారి స్మిత కోటేష్ గౌడ్



నాచారం (వాయిస్ టుడే):కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న SIRలో భాగంగా సికింద్రాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే పద్మారావు ఆదేశాలతో శుక్రవారం తార్నాక డివిజన్‌లో బీ ఆర్ ఎస్ సీనియర్ నాయకురాలు మురారి స్మిత కోటేష్ గౌడ్ 15 రోజులుగా తార్నాక లో దీూా అఖిల తో కలసి ఇంటి ఇంటికి తిరిగి ఓటర్లకు ఎమ్యూనరేషన్ ఫార్మ్ లు అందజేశారు.

వాయిస్
హైదరాబాద్
శనివారం 27 జూన్ 2026




## కార్మికవర్గ యోధుడు డివి క్రిష్ణ

తొర్రూరు, జూన్ 26 (వాయిస్ టుడే ) : భారతదేశ కార్మిక వర్గంలో చైతన్యం నింపటానికి జీవితాంతం కృషిచేసిన కార్మిక వర్గ యోధుడు డివీ కృష్ణ అని యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టి యు సి ఐ) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి రవి అన్నారు. డివి కృష్ణ నాలుగో వర్ధంతి సందర్భంగా శుక్రవారం తొర్రూర్ బస్టాండ్ ఎదురుగా ఆయన చిత్రపటానికి పూలు చల్లి నివాళులు అర్పించారు. అనంతరం రవి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో అన్ని వర్గాల కార్మికులను ఐక్యం చేసి సంఘటితం చేయటంలో కీలకపాత్ర పోషించారని అన్నారు. బీడీ కార్మికుల జీవనోపాధిని దెబ్బతీసే పుర్ర గుర్తు తీసివేయాలని జరిగిన దేశవ్యాప్త పోరాటంలో కీలక పాత్ర పోషించాలని అన్నారు. సింగరేణి గణి కార్మిక సంఘం జ్యూట్,హమాలీ,మున్సిపల్ గ్రామపంచాయతీ కార్మికులను ఐక్యం చేయటానికి జీవితాంతం కృషి చేశారని అన్నారు. హైదరాబాద్ ఇండస్ట్రియల్ ఏరియాలో కార్మిక హక్కులను కాపాడటానికి తీవ్రమైన కృషి చేశారని అన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నేడు తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ వల్ల కట్టు బానిసలుగా మారి శ్రమదోపిడికి గురవుతారని అన్నారు. దీనికి వ్యతిరేకంగా జాతీయస్థాయి ఉద్యమాలను తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 6 ప్రకారం గ్రామీణ ప్రాంతంలో ఉన్న అన్ని రంగాల కార్మికులకు వర్తింపచేయాలని ఆయన కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో టీయూసీఐ నాయకులు బైరీ శీను, గుండాల సోమనరసయ్య, వెంకన్న, కుమార్, గురుకుయాకయ్య, ధర్మయ్య, శ్రీను తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## తొర్రూర్‌లో ఘనంగా మొహరం పర్వదిన వేడుకలు

తొర్రూరు, జూన్ 26 (వాయిస్ టుడే ) : తొర్రూర్ పట్టణ కేంద్రంలో శుక్రవారం ముస్లిం సోదరులు మొహరం పండుగ వేడుకలను సాంప్రదాయబద్ధంగా ఘనంగా జరుపుకున్నారు. ఈ మొహర్రం పర్వదిన వేడుకలను ముస్లిం మత పెద్ద మహమ్మద్ షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు మహమ్మద్ జలీల్, మహమ్మద్ అమీర్, మహమ్మద్ రియాజ్, మహమ్మద్ అమినుల్ ఇస్లాం, మహమ్మద్ బర్కత్ అలీ, మహమ్మద్ ఉమర్, మహమ్మద్ కరీం, మహమ్మద్ ముస్తఫా వీరితోపాటు జలగం స్వామి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీ జాతీయ అధ్యక్షుని పర్యటన జయప్రదం చేయాలి

తొర్రూరు , జూన్ 26 వాయిస్ టుడే : భారతీయ జనతాపార్టీ (బీజేపీ) జాతీయ అధ్యక్షులు నితిన్ నభీన్ గారు ఈనెల 29వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటన విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు పల్లె కుమార్ పిలుపునిచ్చారు.ఈరోజు తొర్రూరు మండలం లోని మండలంలోని అమ్మాపురం గ్రామంలో బీజేపీ తొర్రూరు రూరల్ మండల అధ్యక్షుడు గట్టు రాంబాబు ఆద్వర్యంలో సన్నాహక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈసమావేశంలో బీజేపీజిల్లా ఉపాధ్యక్షులు పల్లె కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నభీన్ మొట్టమొదటి సారిగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటిస్తున్న సందర్భంగా ఈ నెల 29వ తేదీన హన్మకొండ లో బూత్ కమిటీ అధ్యక్షులు,బీఎల్ఏ 2, రాష్ట్ర నాయకులు, జిల్లా అధ్యక్షులు, జిల్లా పదాది కారులు,మండల అధ్యక్షులు, వివిధ మోర్చాల బాధ్యులు, సీనియర్ నాయకులు అందరూ పెద్ద ఎత్తున తరలి వచ్చి ఆయన పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.రాష్ట్రంలో బీజేపీ పార్టీ పటిష్టత, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం కార్యకర్తలను సంసిద్ధం చేయడం ప్రణాళిక సిద్ధం చేయడంలో భాగంగా జాతీయ అధ్యక్షులు నితీన్ నభీన్ మొట్టమొదటి సారిగా ఉమ్మడి వరంగల్ జిల్లా లో పర్యటిస్తున్నారని, ఉమ్మడి వరంగల్ జిల్లా లో బీజేపీ కి పూర్వ వైభవం తెచ్చేందుకు ఆయన పర్యటన ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.ఉమ్మడి జిల్లా లోని జనగామ జిల్లా కేంద్రంలో జాతీయ అధ్యక్షులు నితీన్ నభీన్ కి ఘన స్వాగతం పలుకుతూ స్వాగత కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఈసమావేశంలో బీజేపీ జిల్లా నాయకులు , అమ్మాపురం గ్రామ ఉప సర్పంచ్ సిరిపాటి విశాల్, మండల ప్రధాన కార్యదర్శి గుగులోత్ భాస్కర్ నాయక్, మండల నాయకులు బూత్ కమిటీ అధ్యక్షులు బీఎల్ఏ 2 నాయకులు బండి శ్రీనివాస్,తాడిశెట్టి నవీన్, కిన్నెర రాజ్ కుమార్, కిన్నెర శ్రీనివాస్, పురాణపు బాబా మహేష్, కిన్నెర హన్మంతు, కిన్నెర సాయి కిరణ్, సిరిపాటి వెంకటేష్, ఊర శివ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి శ్రీధర్ బాబుపై నిరాధార ఆరోపణలు చేస్తే ఊరుకోం

### సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,మాజీ విప్ ఆరెపల్లి మోహన్

### మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఆత్మవిమర్శ చేసుకోవాలి



కరీంనగర్, జూన్ 26(వాయిస్ టుడే): రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని జీర్ణించుకోలేక ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వంపై అనవసరపు ఆరోపణలు చేస్తున్నారని మాజీ ప్రభుత్వ విప్ ఆరెపల్లి మోహన్ మండిపడ్డారు.నగరంలోని కెమిస్ట్ భవన్ లో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య,ఆర్ జీపిఎస్ రాష్ట్ర కోకన్వీనర్ ఉప్పుల అంజన్ ప్రసాద్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అకారపు భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎండి తాజుద్దీన్,అర్బన్ బ్యాంకు చైర్మన్ కర్ర రాజశేఖర్, ఎన్.ఎస్.యు ఐ రాష్ట్ర నాయకులు పోతారం సురేందర్ తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆరెపల్లి మోహన్ మాట్లాడుతూ ఫ్యూచర్ సిటీలో అవకతవకలు జరిగాయని,మంత్రి శ్రీధర్ బాబు అవినీతికి పాల్పడుతున్నారని మాజీ మంత్రి జీవన్ రెడ్డిచేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. శ్రీధర్ బాబుపై చేసిన ఆరోపణలపై మీ వద్ద సాక్ష్యాలు ఉంటే బహిరంగపరచాలి.అవినీతిని రుజువు చేసినట్లయితే రాజకీయాల నుండి శాశ్వతంగా వైదొలుగుతానని, నిరూపించినట్లయితే జీవన్ రెడ్డి గారు రాజకీయాల నుండి తప్పుకుంటారా ఆరెపల్లి మోహన్ సవాల్ విసిరారు. ధైర్యం ఉంటే 2016 నుండి మంథని ప్రాంతంలో ఇసుక దందా ఎవరు ప్రారంభించారో రుజువు చేయాలని అన్నారు,ఇసుక మాఫియాను విచ్చలవిడిగా కొనసాగించింది గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా అని మండిపడ్డారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మూడు ఎకరాల భూమి ఏమైందని,దళితులకు ఇందిరాగాంధీ హయాంలో ఇచ్చిన భూములను తీసుకొని స్మశాన వాటికల్లో రైతు వేదికలు నిర్మించిన సంగతి నిజం కాదా అని నాడు కెసిఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన జీవన్ రెడ్డి ఇప్పుడు మంత్రి శ్రీధర్ బాబు తండ్రితో పని చేశానని చెప్పుకుంటూ ఆయనను టార్గెట్ చేస్తూ మాట్లాడుతున్నారు.శ్రీధర్ బాబు నిజాయితీ గురించి జిల్లా ప్రజలకు, రాష్ట్ర ప్రజలకు బాగా తెలుసు జీవన్ రెడ్డి గత చరిత్ర ఒకసారి గుర్తు చేసుకోవాలి అని పేర్కొన్నారు. వామన్ రావు దంపతుల హత్య ఉదంతం మంథనిలో శాంతి భద్రతల లోపించడానికి ఎవరు బాధ్యులు జీవన్ రెడ్డికి తెలియదా అని ప్రశ్నించారు.బిఆర్ఎస్ పాలనలో దళిత బంధు పథకాన్ని కేవలం హుజురాబాద్‌కు మాత్రమే ఎందుకు పరిమితం చేశారు? రాష్ట్రవ్యాప్తంగా ఎందుకు అమలు చేయలేదు? దీని గురించి బీఆర్ఎస్ నేతలు ఎందుకు మాట్లాడరు అని మండిపడ్డారు. కులాలకు,మతాలకు అతీతంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుంది.నాడు ఇందిరాగాంధీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నేటికీ కొనసాగుతున్నాయి. వడ్ల కొనుగోలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు 100 శాతం న్యాయం చేసింది అని అన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ నేతలు తమ ఉనికి కోల్పోతున్నామని, ఎస్ఐఆర్ పేరుతో నియోజకవర్గాల పర్యటన చేపడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై అక్కసు వెళ్లగకుతున్నారు.పుట్ట మధుకర్ అనే వ్యక్తి ఇసుక దోపిడీకి బ్రాండ్ అంబాసిడర్.నేటికీ ప్రతిపక్ష నాయకుడిగా ఇసుక కాంట్రాక్టర్లను, రోడ్డు కాంట్రాక్టర్లను బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్నారు. అలాంటి వ్యక్తికి వంత పడుతూ జీవన్ రెడ్డిమాట్లాడటం సరైన పద్ధతి కాదు.కాళేశ్వరంలో రెండు గేట్లు కుంగిపోతే దానిని చిన్నచూపు చూస్తూ ఏం నష్టం జరుగుతుందని హేళన చేస్తూ మాట్లాడుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం బీఆర్ఎస్ అవినీతికి నిదర్శనం.10 ఏళ్లు రాష్ట్రాన్ని దోచుకొని,సొంత ఖజానాకు తరలించి,అప్పుల పాలు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలు అమలు కాకపోవడానికి కారణం మీరు చేసిన అప్పులే.గ్రానైట్ క్వారీలలో బ్లాక్ మెయిల్‌కు పాల్పడి వసూలు చేసింది కేటీఆర్,హరీశ్ రావు కాదా? రాబోయే రోజుల్లో శ్రీధర్ బాబు లాంటి నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోం.మా కాంగ్రెస్ కార్యకర్తలు కన్నెర్ర చేస్తే మీరు తట్టుకోలేరు.ఇందిరమ్మ ఇల్లు,200 యూనిట్ల ఉచిత విద్యుత్,సన్న బియ్యం ఇవ్వడం ప్రజా వంచన అవుతుందా? బాధ్యతగల మంత్రిగా ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర అభివృద్ధి కోసం శ్రీధర్ బాబు ఎంతో శ్రమిస్తున్నారు అని వెల్లడించారు.



## ఘనంగా ఆరంభమైన కోటి దేవి ఖడ్గమాల స్తోత్ర పారాయణం

### అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

కాజీపేట, (వాయిస్ టుడే) : కాజీపేటలోని స్వయంభూ శ్రీ శ్వేతార్క మూల గణపతి దేవాలయం దివ్యక్షేత్రంలో నిజ జ్యేష్ఠ శుద్ధ ద్వాదశి సందర్భంగా శుక్రవారం కోటి దేవి ఖడ్గమాల స్తోత్ర పారాయణ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా ఆది గణపతి ఆరాధన నిర్వహించి, గణపతి పూజ,పుణ్యాహవాచనం కార్యక్రమాలను నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ధరిత్రి నేతృత్వంలో ఆలయ పరిపాలక నిర్వాహకులు సాయి కృష్ణ శర్మ ఆధ్వర్యంలో మహిళా భక్తులతో కలిసి ఖడ్గమాల స్తోత్ర పారాయణం చేపట్టారు. అయినవోలు రాధాకృష్ణ శర్మ సిద్ధాంతి గణపతి పూజ,పుణ్యాహవాచనాన్ని నిర్వహించగా సాయి కృష్ణ శర్మ సిద్ధాంతి భక్తులతో ఖడ్గమాల స్తోత్ర పారాయణం చేయిస్తూ దాని మహిమ,విశిష్టతలను వివరించారు. ఈ యజ్ఞంలో అధిక సంఖ్యలో భక్తులు ప్రత్యక్షంగా,పరోక్షంగా పాల్గొని విజయవంతం చేయాలని, తద్వారా అమ్మవారి సంపూర్ణ అనుగ్రహంతో పాటు శ్వేతార్క గణపతి ఆశీస్సులు పొందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రమాదేవి, ధరిత్రి, సులోచన, సరోజన, ఉమాదేవి, ఉమారాణి, అరుణ, కల్పన, సునీత, మంజూష, మాలిక, భాగ్యలక్ష్మి, మంజుల,సుజాత,శ్రావణి,సాయిరాం,వెంకటసాయి,వారికోల్ సాయితేజ తదితర భక్తులు పాల్గొన్నారు.



## మిల్స్ కాలనీ సీఐ స్వామిని కలిసిన MHD బృందం

హనుమకొండ, (వాయిస్ టుడే) : మాదిగ హక్కుల దండోరా (వీఎంఐ) రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ రామకృష్ణ పెరుమాండ్ల ఆదేశాలతో రాష్ట్ర సలహాదారు కొమ్ముల బాబు నేతృత్వంలో నాయకులు సిలువేరు చంద్రమౌళి,మంద రాజు,ఈసంపెల్లి ప్రభాకర్,కొమ్ముల అఖిల్ లు మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కర్రే స్వామిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాదిగ సమాజ హక్కుల పరిరక్షణ,సామాజిక న్యాయం,రాజ్యాంగ విలువల పరిరక్షణ,శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు శాఖతో సమన్వయంతో పనిచేయాల్సిన అవసరంపై వారు చర్చించారు. సమాజంలో శాంతి,సామరస్యం నెలకొనేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అభిప్రాయపడ్డారు. సీఐ కర్రే స్వామి ప్రజా సమస్యల పరిష్కారానికి,చట్టబద్ధమైన హక్కుల పరిరక్షణకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

## మినీ హైమాస్ట్ లైట్లను ప్రారంభించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



కరీంనగర్,జూన్ 26(వాయిస్ టుడే): నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని 12వ డివిజన్ రామచంద్రాపూర్ కాలనీలోని పెద్దమ్మ దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన మినీ హైమాస్ట్ లైట్లను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని అన్ని డివిజన్లలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నగరపాలక సంస్థ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.దేవాలయాలు, కాలనీలు,ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో మెరుగైన వెలుతురు ఉండేలా మినీ హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.ఈ లైట్ల ఏర్పాటు ద్వారా రాత్రి వేళల్లో భక్తులు, స్థానిక ప్రజలకు సౌకర్యవంతమైన వాతావరణంతో పాటు భద్రత కూడా మెరుగుపడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు,12వ డివిజన్ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ వేణు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు,ముదిరాజ్ సంఘం పెద్దలు,స్థానిక నాయకులు,డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

## బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా రాపాక ప్రవీణ్ నియామకం



కరీంనగర్, జూన్ 26(వాయిస్ టుడే): భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కరీంనగర్ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా రాపాక ప్రవీణ్ నియమితులయ్యారు.ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అధికారిక నియామక ఉత్తర్వులను జారీ చేశారు.రాపాక ప్రవీణ్ గతంతో మానకొండూర్ మండల అధ్యక్షునీగా పనిచేశారు. ప్రస్తుతం మానకొండూరు మండలం లక్ష్మీపూర్ ఉప సర్పంచ్ గా,సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డ్ అడ్వైజరీ ప్యానెల్ మెంబర్ హోదాలో కొనసాగుతున్నారు.ఎస్సీ వర్గాల సమస్యలకోసం,జిల్లాలో ఎస్సీ మోర్చా విభాగం మరింత బలోపేతం చేయడానికి,కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కృషి చేస్తానని రాపాక ప్రవీణ్ ఈ సందర్భంగా తెలిపారు.పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని,జిల్లాలో ఎస్సీ మోర్చాను అత్యంత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తానని,తన నియామనకానికి సహకరించిన కేంద్ర మంత్రి బండి సంజయ్,జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి,బీజేపీ నాయకులు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.



## హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహణ

కరీంనగర్,జూన్ 26(వాయిస్ టుడే): నగరంలోని 36వ డివిజన్ మారుతీనగర్లో హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగిందని సంస్థ వ్యవస్థాపకులు ధనపురి సాగర్ తెలియజేశారు.ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన,విలువలతో కూడిన జీవితాన్ని గడపాలని పిలుపునిచ్చారు.మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబం,సమాజం మరియు దేశాభివృద్ధిపై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు.అనంతరం మాదకద్రవ్యాల నివారణపై ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు ధనపురి సాగర్ 36 వ డివిజన్ కార్పొరేటర్ తోట అనిల్,సంస్థ కోశాధికారి టి.తిరుపతి సభ్యులు శేఖర్,కళ్యాడపు నరేష్,సదానందం, విజయ్,సిహెచ్ మాధవ్ డివిజన్ యువత ఆటో యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

RNI No: TGTEL/25/A2649 VOICE OF PRAJALU
వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం.. తెలుగు దినపత్రిక



# క్రీడాస్ఫూర్తికి ప్రతీకగా గర్రెపల్లి వాలీబాల్ టోర్నమెంట్

## వాలీబాల్ టోర్నమెంట్ కీలక సమావేశం!

సుల్తానాబాద్ పెద్దపెల్లి జిల్లా జూన్-26 వాయిస్ టుడే: సుల్తానాబాద్‌లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఉమ్మడి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఆసంపల్లి శ్రీనివాస్ ను మర్యాదపూర్వకంగా కలిసి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా గర్రెపల్లి గ్రామంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న వాలీబాల్ టోర్నమెంట్ విజయవంతమైన నిర్వహణకు సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలపై సుదీర్ఘంగా చర్చించడం జరిగింది. ఈ సమావేశంలో పెద్దపల్లి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కస్తూరి లక్ష్మారెడ్డి కరీంనగర్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మిరియ్యాల శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర సీనియర్ వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కన్న రమేష్ పాల్గొని తమ విలువైన సూచనలు, సలహాలను అందించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్‌ను క్రీడాస్ఫూర్తికి ప్రతీకగా, అత్యున్నత స్థాయిలో నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారుల భాగస్వామ్యం, పోటీల నిర్వహణ, ఆహ్వానాలు, క్రీడాకారులకు కల్పించాల్సిన సౌకర్యాలు, ప్రేక్షకుల కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో వాలీబాల్ క్రీడాభివృద్ధికి మరింత ప్రోత్సాహం అందిస్తూ యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించే దిశగా ఈ టోర్నమెంట్ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. క్రీడల ద్వారా యువత శారీరక, మానసిక వికాసం సాధించడంతో పాటు సమాజంలో ఐక్యత, క్రమశిక్షణ, సేవాభావం పెంపొందుతాయని అభిప్రాయపడ్డారు. రానున్న రోజుల్లో గర్రెపల్లి వేదికగా జరిగే ఈ వాలీబాల్ టోర్నమెంట్‌ను క్రీడాకారులు, క్రీడాభిమానులు చిరస్మరణీయంగా గుర్తుంచుకునేలా అన్ని వర్గాల సహకారంతో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. క్రీడల అభివృద్ధి యువత ప్రగతి గర్రెపల్లి వాలీబాల్ టోర్నమెంట్ విజయవంతం కావాలని అన్నారు..

# డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యంగా ముందుకు

**యువత, విద్యార్థులు డ్రగ్స్ కు దూరంగా ఉండాలి**

**తమ భవిష్యత్ ప్రణాళిక వైపు పయనించాలి**

**ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**




రాజన్న సిరిసిల్లా (వాయిస్ టుడే ప్రతినిధి): డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళుతుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈగల్ ఫోర్స్ ఆద్వర్యంలో మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాలపై జిల్లావ్యాప్తంగా వివిధ విద్యాలయాల్లో వారం రోజులుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం, మాదక ద్రవ్యాల దుష్ప్రభావాల దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈగల్ ఫోర్స్ ఆద్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కార్యక్రమాన్ని అంబేద్కర్ చౌరస్తా వద్ద శుక్రవారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు ఎస్పీ చంద్రయ్యతో కలిసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా నుంచి పద్మనాయక కల్యాణ మండపం వరకు నిర్వహించారు. అనంతరం మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలు, నష్టాలపై స్కూల్ విద్యార్థులు, సిరిసిల్ల నర్సింగ్ కళాశాల విద్యార్థుల ప్రదర్శనలు అందరినీ ఆలోచింపజేశాయి. డ్రగ్స్ కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. వివిధ స్టాళ్లను అతిథులు పరిశీలించి.. వివరాలు అడిగి తెలుసుకున్నారు. లిపిల్లల భద్రత.. డ్రగ్స్ కు అడ్డుకట్టలి లిసే నో టూ డ్రగ్స్.. సే ఎస్ టూ లైఫ్‌లి నినాదాలు చేశారు.




# డ్రగ్స్ మహమ్మారిని అరికట్టేందుకు సమాజమంతా కృషి చేయాలి

**డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి. నరేష్ పటేల్**

కరీంనగర్,జూన్ 26(వాయిస్ టుడే): అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా డీవైఎఫ్ఐ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కరీంనగర్ బస్టాండ్ ఆవరణలో విస్తృత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్‌కు వచ్చిన ప్రయాణికులు,విద్యార్థులు,యువత, ప్రజలకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అలాగే యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.నరేష్ పటేల్ మాట్లాడుతూ,నేడు దేశంలో డ్రగ్స్ వినియోగం ఆందోళనకర స్థాయికి చేరుకుందని అన్నారు. యువతను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ మాఫియా తమ కార్యకలాపాలను విస్తరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల యువత శారీరక,మానసిక ఆరోగ్యంతో పాటు వారి భవిష్యత్తు కూడా నాశనం అవుతోందని అన్నారు. కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగ సమస్య,యువతకు తగిన ఉద్యోగ,ఉపాధి అవకాశాలు లేకపోవడం కూడా కొంతమంది యువత చెడు అలవాట్ల వైపు మళ్లడానికి కారణమవుతోందని పేర్కొన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు క్రీడా, సాంస్కృతిక రంగాలను ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. సినిమాలు,సోషల్ మీడియా వేదికల ద్వారా మాదక ద్రవ్యాలను గ్లామరైజ్ చేసే ధోరణిని అరికట్టాలని, యువతలో శాస్త్రీయ దృక్పథం, సామాజిక బాధ్యత పెంపొందించే కార్యక్రమాలను ప్రభుత్వాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం డీవైఎఫ్ఐ నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు అవసరమైతే ఉద్యమాలు కూడా చేపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శివ కుమార్,కృష్ణ, నాయకులు దినేష్.కౌశిక్,ప్రసాద్. నాగరాజు,మురళి,చిన్ను,జీవన్, సాయి పాల్గొన్నారు.



# నాగార్జునసాగర్‌లో ఘనంగా మొహరం వేడుకలు

**కులమతాలకు అతీతంగా కాలనీ వాసుల ఐక్యతకు ప్రతీకగా**

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంగయ్య పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు**

**పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు**

నాగార్జునసాగర్ జూన్ 26 (వాయిస్ టుడే) : నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలో మొహరం వేడుకలను భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొని పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ వేడుకలు సామరస్యానికి, సోదరభావానికి ప్రతీకగా నిలిచాయి. ఈ కార్యక్రమ నిర్వహణలో జానయ్య కుటుంబ సభ్యులతో పాటు కృష్ణయ్య, చిన్నయ్య, సాయిలు, వెంకటేశ్వర్లు, జంగయ్య, భూషరాల కృష్ణయ్య, ఆశప్ప, శీను, నరేందర్, సతీష్, జగన్, సంతోష్, నవీన్, కుమార్, శివ, జగదీష్, బాల, ఈశ్వర్ తదితర కాలనీ వాసులు చురుకుగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు జంగయ్య పాల్గొని పీర్లకు మొక్కులు చెల్లించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కులమతాలకు అతీతంగా అందరూ కలిసి పండుగలను జరుపుకోవడం సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పీర్ల ఆశీర్వాదాలు పొందారు. కాలనీలలో పేర్లను ఘనంగా ఊరేగించారు.

# టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా ఆరెపల్లి రాహుల్ నియామకం



సుల్తానాబాద్ పెద్దపెల్లి జిల్లా జూన్-26 వాయిస్ టుడే: సుల్తానాబాద్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరెపల్లి రాహుల్ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర డికార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, మంత్రి శ్రీధర్ బాబు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణారావు, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కోఆర్డినేటర్ కొరివి అరుణ్ కుమార్లకు ఆరెపల్లి రాహుల్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఎస్సీ వర్గాల అభ్యున్నతి, కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం రాష్ట్రవ్యాప్తంగా అంకితభావంతో పనిచేస్తానని ఆరెపల్లి రాహుల్ పేర్కొన్నారు. అలాగే పార్టీ తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ వర్గాల సంక్షేమం, సామాజిక న్యాయం, యువతకు రాజకీయ అవకాశాల కల్పన, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటానని తెలిపారు. పార్టీ బలోపేతం కోసం క్షేత్రస్థాయిలో కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు.




# ఉన్నత లక్ష్యాల సాధనకు మత్తు పదార్థాలు అవరోధం

**కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్**

కరీంనగర్, జూన్ 26(వాయిస్ టుడే): జిల్లా కేంద్రానికి చెందిన ఆసరా ఫౌండేషన్ (ఆపదలో సహాయానికి రా) ఆధ్వర్యంలో జూన్ 26 అంతర్జాతీయ మత్తుపదార్థాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన పోస్టర్ ను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆవిష్కరించినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మరియు ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ రాపోలు గోపి కృష్ణ తెలిపారు. తీగలగుట్టపల్లిలోని మేయర్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్ పోస్టర్ ను ఆవిష్కరించి మాట్లాడుతూ యువత ఉన్నత లక్ష్యాలను సాధించుటకు మత్తు పదార్థాలు అవరోధమని పేర్కొంటూ మంచి స్నేహితులను ఎంచుకోవడం ద్వారా ఆరోగ్య వంతమైన జీవితంతో అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చు అన్నారు. ప్రతి ఒక్కరూమత్తుపదార్థాల వల్ల జరిగే తీవ్రమైన అనర్థాలు గూర్చి అవగాహన కలిగి ఉండి సమాజాన్ని చైతన్య పరచాలన్నారు. సంస్థ అధ్యక్షులు డాక్టర్ ఆర్ గోపికృష్ణ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన శరీరానికి,శాంతియుతమైన మనస్సుకు మరియు ప్రకాశవంతమైన భవిష్యత్తుకు మత్తు పదార్థాలు హానికరమని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసరా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఆర్. గోపి కృష్ణ,మూడవ డివిజన్ కార్పొరేటర్ సాదవేణి లావణ్య మునిందర్,నగునూరు గ్రామ సర్పంచ్ సాయిల్ల శ్రావణి మహేందర్,ఆసరా ఫౌండేషన్ సభ్యులు కె. ప్రవీణ్,జి. తిరుపతి,ఎం.రవిచందర్,ఎస్. నిఖిల్, కె.సంజీవరావు, వి.అద్వైత్ పాల్గొన్నారు




# టయోటా షోరూంలో అర్బన్ క్రూజర్ ఎబెల్లా కార్‌ను లాంచ్ చేసిన మధుయాష్కి గౌడ్

ఎల్బీనగర్ జూన్ 26 (వాయిస్ టుడే) : చింతల్ కుంటలోని టాయోట షోరూం లో నూతనంగా మార్కెట్ లోకి తీసుకువచ్చిన అర్బన్ క్రూజర్ ఎబెల్లా కారును టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ముఖ్యఅతిథిగా శుక్రవారం హాజరై లాంచ్ చేశారు. వినియోదారుల అభిరుచులకు అనుగుణంగా ఫీచర్లను అందించినప్పుడే వారి ఆదరణ పొందగలమని ఈ సందర్భంగా నిర్వాహకులకు మధుయాష్కి సూచించారు. ఆ కారులోని నూతన సాంకేతిక ఫీచర్ల గురించి నిర్వాహకులు ఆయనకు వివరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వరరెడ్డి , నాయకులు కొత్తకురుమ శివకుమార్ , మేకల వీరన్న యాదవ్ , డివిజన్ అధ్యక్షులు బుడ్డా సత్యనారాయణ మకుటం సదాశివుడు , కుట్ల నర్సింహా యాదవ్ , శ్రీపాల్ రెడ్డి , శశిధర్ రెడ్డి , బద్దుల వేణుగోపాల్ యాదవ్ , చెన్నగోని రవీందర్ , మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నేలపాటి రామారావు మేఘవత్ గణేష్ నాయక్ , మాజీ కౌన్సిలర్ ఈశ్వరమ్మ యాదవ్ , నాయకులు భీమిడి రామకృష్ణారెడ్డి , సామ మహేశ్వర్ రెడ్డి , గణేష్ రెడ్డి , కంచర్ల కవిత న్యాయవాది గంగిరెడ్డి వేములయ్య గౌడ్ , దాము మహేందర్ యాదవ్ బాలకృష్ణ యాదవ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# బుద్ధవనం సందర్శించిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన న్యాయమూర్తి

నాగార్జునసాగర్, జూన్, 26: (వాయిస్ టుడే) :అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ లోని బుద్ధవనాని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి వి.ఈశ్వరయ్య సతీసమేతంగా సందర్శించారు. సాగర్ సందర్శనలో భాగంగా విజయ విహార్ అతిథి గృహానికి చేరుకున్న వీరికి పెద్దవూర తాసిల్దార్ కాసీం, ప్రోటోకాల్ ఆఫీసర్ దండ శ్రీనివాస్ రెడ్డి, నిడమనూరు కోర్టు డిప్యూటీ నాజార్ శివ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వీరు బుద్ధవనం సందర్శించి బుద్ధ చరిత వనములోని బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు. బుద్ధవనం సమావేశ మందిరంలో బుద్ధవనం విశేషాలు తెలిపే లఘు చిత్రాన్ని వీక్షించారు. అనంతరం మహాస్తూపంలోని ధ్యాన మందిరంలో బుద్ధజ్యోతులను వెలిగించిన అనంతరం బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఆఫీసర్ రవిచంద్ర లు వీరికి బుద్ధవనం కండువాలతో, బ్రోచర్లతో సత్కరించారు. అనంతరం వీరు నాగార్జునసాగర్ డ్యామ్ ను సందర్శించారు. వీరితోపాటు ఎస్ఐ సతీష్, టూరిజం గైడ్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థులు మీరెక్కడ ?

**రియంబర్స్మెంట్ నిధులు విడుదల కోసం పోరాటం ఏమైంది**

**దొగ్గలి శ్రీధర్ ప్రశ్న**



కరీంనగర్,జూన్ 26(వాయిస్ టుడే): గత సంవత్సరం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి,బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థులు రియంబర్స్మెంట్ నిధులు విడుదల కోసం ఉద్యమం చేసి కళాశాలల ఉనికిని కాపాడుతామని ప్రకటించి పోటీ చేసి వారి మద్దతు కూడా కొట్టుకున్న ఎమ్మెల్సీ అభ్యర్థులారా ఇప్పటివరకు దీనికొరకు మీ పోరాటం మీ ఉద్యమం ఎక్కడ అని బీసీ సంక్షేమ సంఘం నాయకులు దొగ్గలి శ్రీధర్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ ప్రభుత్వం పదివేల కోట్ల బకాయిలు విడుదల చేయలేదు అలాగే జీవో ఎంఎస్ 8 మరియు 9 ని విడుదల చేసి విద్యార్థుల కౌన్సిలింగ్లో గందరగోళం ఏర్పడింది. కాంగ్రెస్ అభ్యర్థి ప్రతి మూడు నెలలకు ఒకసారి రియంబర్స్మెంట్ నిధులు విడుదల చేయించి అన్ని కళాశాలలను ఆదుకుంటామని దాని కొరకు ముఖ్యమంత్రి వద్దకు వెళ్లి సమస్యలు దృష్టికి తీసుకు వెళ్తామని పరిష్కరిస్తామని నిధులు విడుదల చేపిస్తామని పలు సందర్భాలలో బహిరంగ ప్రకటన చేశారు. అప్పుడు ఉమ్మడి కరీంనగర్ ఉమ్మడి ఆదిలాబాద్ నిజామాబాద్ మెదక్ జిల్లాలోని డిగ్రీ జూనియర్ ఇంజనీరింగ్ వివిధ కళాశాలలోని అధ్యాపకులు అందరూ సంపూర్ణ సహకారం అందించారు. అలాంటి అధ్యాపక వర్గానికి జీతాలు చెల్లించలేని పరిస్థితిలో కళాశాల యజమాన్యాలు ఉండగా ఇప్పటివరకు ఈ సమస్యపై మీరు ఒక్కసారైనా స్పందించలేదని, కేవలం ఎన్నికల కోసం మాత్రమే వాగ్దానాలు చేశారని, కళాశాలల, ఉపాధ్యాయుల కోసం మీరు చేసిన పోరాటం ఏమి లేదని ఇప్పటికైనా ఫీజు రీ అంబర్స్మెంట్ కోసం పోరుబాట పట్టాలని ఎమ్మెల్సీ అభ్యర్థులను కోరారు.

# యువత మేలుకో డ్రగ్స్ మానుకో...? : ఎస్పీ జానకి




మహబూబ్నగర్ జిల్లా (వాయిస్ టుడే) : జడ్చర్ల /అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జడ్చర్లలో భారీ వాకథాన్ ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ డి.జానకి, అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జడ్చర్ల పట్టణంలోని మినీ స్టేడియం, బీఆర్ఆర్ డిగ్రీ కళాశాల గ్రౌండ్స్‌లో జడ్చర్ల పోలీసుల ఆధ్వర్యంలో భారీ అవగాహన వాకథాన్ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సుమారు 1500 మంది విద్యార్థులు, వాకర్స్, యువత, మహిళలు, అధికారులు మరియు ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకరమైన సామాజిక దుష్ప్రవర్తన అని తెలిపారు. తాత్కాలిక ఆనందం కోసం డ్రగ్స్ వైపు మళ్లే యువత తమ జీవితాలను, కుటుంబాల ఆశలను, సమాజ భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నారని పేర్కొన్నారు. జడ్చర్ల పట్టణం వ్యాపార, విద్యా మరియు రవాణా పరంగా ముఖ్య కేంద్రంగా ఉండటంతో, దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలు ఇక్కడ నివసిస్తూ ఉంటారని, ఈ పరిస్థితుల్లో మాదకద్రవ్యాల వినియోగం మరియు అక్రమ రవాణాకు అవకాశాలు పెరిగే అవకాశం ఉందని ఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, జడ్చర్ల టౌన్ ఇన్స్పెక్టర్ కమలాకర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కృష్ణ, సీసీఎస్ ఇన్స్పెక్టర్ నాగార్జున గౌడ్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, వాకింగ్ అసోసియేషన్ సభ్యులు, యోగా సభ్యులు, విద్యార్థులు, క్రికెట్ అసోసియేషన్ సభ్యులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

వాయిస్ టుడే
హైదరాబాద్
శనివారం 27 జూన్ 2026

## కార్యకర్తకు దక్కిన అరుదైన గౌరవం

**బీజేపీ ఓబీసీ మోర్చా రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా రేగుల సంతోష్ బాబు**



రాజన్న సిరిసిల్ల (వాయిస్ టుడే ప్రతినిధి ): భారతీయ జనతా పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా అంకితభావంతో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్న కార్యకర్తకు అరుదైన గౌరవం దక్కింది.ఈ సందర్భంగా వేములవాడ పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్,పార్టీ సీనియర్ నాయకుడు రేగుల సంతోష్ బాబును బీజేపీ ఓబీసీ మోర్చా రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా పార్టీ అధిష్ఠానం నియమించింది.శుక్రవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు సూచనల మేరకు రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షులు జి.ఆనంద్ గౌడ్ రాష్ట్రవ్యాప్తంగా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులను ప్రకటించారు.ఇందులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా రేగుల సంతోష్ బాబుకు బాధ్యతలు అప్పగించారు.పార్టీ కోసం క్షేత్రస్థాయిలో నిరంతరం శ్రమిస్తూ, ప్రజల సమస్యలపై స్పందిస్తూ, సంస్థాగత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్న సంతోష్ బాబుకు ఈ బాధ్యతలు అప్పగించడం ఆయన సేవలకు పార్టీ ఇచ్చిన గుర్తింపుగా కార్యకర్తలు అభివర్ణిస్తున్నారు.సాధారణ కార్యకర్త స్థాయి నుంచి క్రమశిక్షణ,అంకితభావంతో ఎదిగిన ఆయనకు ఈ పదవి దక్కడం జిల్లాలోని బీజేపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది.ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన కేంద్ర మంత్రి బండి సంజయ్,ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్,పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి,వేములవాడ నియోజకవర్గం ఇంచార్జ్ చెన్నమనేని వికాస్ రావు,పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి,మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ లతో పాటు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు రేగుల సంతోష్ బాబుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఓబీసీ మోర్చా మరింత బలోపేతం చేయడంతో పాటు పార్టీని గ్రామస్థాయి వరకు విస్తరించేందుకు సమర్థవంతంగా పనిచేస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు.తనపై పూర్తి విశ్వాసం ఉంచి ఈ అవకాశం కల్పించిన పార్టీ రాష్ట్ర నాయకత్వానికి ఎల్లవేళలా రుణపడి ఉంటానని పేర్కొన్నారు.పార్టీ ఆశయాలు,సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు,ఓబీసీ వర్గాల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తానని చెప్పారు.




## వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ జీవీఆర్ కరాటే అకాడమి

హైదరాబాద్, జూన్ 26: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ పర్యవేక్షణలో శుక్రవారం కాచిగూడ లోని జీవీఆర్ కరాటే అకాడమీ లో నిర్వహించిన కార్యక్రమంలో కరాటే విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శన కనబరిచి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించారు. కరాటే మాస్టర్ డాక్టర్ జిఎస్ గోపాల్రెడ్డి కరాటే విద్యార్థులైన భార్గవసాయి, ప్రణీత్, నైతిక్ రెడ్డి, సంజన, తన్వి, చిన్మయి ప్రియాలతో కలిసి ఈ రికార్డు చేశారు. 36 సెకండ్లలో 6 మంది విద్యార్థుల తలలపై ఉంచిన 26 యాపిల్స్ను చేతితో బ్రేక్ చేసి రికార్డు సృష్టించారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ఇండియా చీఫ్ కో-ఆర్డినేటర్ బింగి నరేందర్ గౌడ్ రికార్డు చేసిన గోపాల్రెడ్డితో పాటు విద్యార్థులకు సర్టిఫికెట్స్, మెడల్స్ను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మహాలక్ష్మి రామన్ గౌడ్, కన్నె ఉమా రమేష్ యాదవ్, డాక్టర్ ఎ.కృష్ణారెడ్డి, కోట్ల నిరంజన్ రెడ్డి, కరీమ్, అమృతరెడ్డి, గణ సంతోషిణిరెడ్డి, రాజు, సుధాకర్, అనఘ, షైనీ, ద్వైత తదితరులు పాల్గొని రికార్డు గ్రహీతలు అభినందించి సత్కరించారు. జివిఆర్ కరాటే అకాడమీ వ్యవస్థాపకులు, డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి తన అసాధారణ కరాటే నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ.. ఆరుగురు విద్యార్థుల తలపై ఉంచిన 26 ఆపిల్స్ను కేవలం 36 సెకన్లలో హ్యాండ్ చాప్స్ ద్వారా బ్రేక్ చేసి సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పారు. ఈ సందర్భంగా వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ఇండియా చీఫ్ కో-ఆర్డినేటర్ శ్రీ బింగి నరేందర్ గౌడ్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సమాజానికి చైతన్యాన్ని కలిగించే సందేశంతో ఈ ప్రపంచ రికార్డును నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కేవలం 36 సెకన్లలో అత్యంత క్రమశిక్షణ, ఏకాగ్రత, భద్రతా ప్రమాణాలతో ఈ విన్యాసాన్ని విజయవంతంగా పూర్తి చేసిన డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డిని అభినందించారు. ప్రపంచ రికార్డులు కేవలం ప్రతిభను ప్రదర్శించడానికి మాత్రమే కాకుండా సమాజానికి ఉపయోగపడే సందేశాన్ని అందించేలా ఉండాలని, ఆ దిశగా డాక్టర్ గోపాల్ రెడ్డి ఎన్నో సంవత్సరాలుగా కృషి చేస్తున్నారని కొనియాడారు. అలాగే ఈ రికార్డులో పాల్గొన్న భార్గవ సాయి, ప్రణీత్, నైతిక్ రెడ్డి, సంజన, తన్వి, చిన్మయి ప్రియ లను ప్రత్యేకంగా అభినందిస్తూ, వారి ధైర్యం, విశ్వాసం, క్రమశిక్షణ ఈ ప్రపంచ రికార్డు విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి, పాల్గొన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మరియు జివిఆర్ కరాటే అకాడమీ బృందానికి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ తరఫున శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ప్రపంచ రికార్డులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మాజీ హిమాయత్నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్, మాజీ కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేష్ యాదవ్, శ్రీ రమేష్ యాదవ్, వివేక్ హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎ. కృష్ణా రెడ్డి, నేతాజీ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వ్యవస్థాపకులు మరియు డైరెక్టర్ కోట్ల నిరంజన్ రెడ్డి, జివిఆర్ కరాటే అకాడమీ బ్లాక్ బెల్ట్స్ కరీమ్, అమృత రెడ్డి, గణ సంతోషిణి రెడ్డి, రాజు, సుధాకర్, అనఘ, షైనీ, ద్వైతతో పాటు అకాడమీ విద్యార్థులు, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొని డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి మరియు విద్యార్థులను అభినందించారు.

## ఎల్కుర్తి, రామన్నగూడెంలో అవగాహన ర్యాలీతో బెల్ట్ షాపుల నిర్మూలనకు శ్రీకారం

**నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.10 వేల జరిమానా**

**- గ్రామస్తుల సహకారంతో మద్యరహిత గ్రామాలే లక్ష్యం**

హనుమకొండ, జూన్ 26: సమాజంలో మద్యం వ్యసనాన్ని తగ్గించి, కుటుంబాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పాలనే లక్ష్యంతో ధర్మసాగర్ మండలంలోని ఎల్కుర్తి, రామన్నగూడెం గ్రామాల గ్రామపంచాయతీలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఈనెల 26వ తేదీ నుంచి రెండు గ్రామాల్లో బెల్ట్ షాపులను పూర్తిగా మూసివేయాలని పాలకవర్గం ఏకగ్రీవంగా నిర్ణయించింది. ఈ నిర్ణయంపై గ్రామ ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శుక్రవారం ఎల్కుర్తి గ్రామంలో సర్పంచ్ నరిశెట్టి సుధాకర్, ఉప సర్పంచ్ కొలిపాక రమేష్ ఆధ్వర్యంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహిస్తూ బెల్ట్ షాపులు కుటుంబాల ఆర్థిక పరిస్థితిని దెబ్బతీయడంతో పాటు యువతను వ్యసనాలకు బానిసలుగా మార్చి సామాజిక సమస్యలకు కారణమవుతున్నాయని ప్రజలకు వివరించారు.

# ప్రపంచ శాంతి కోసం హైదరాబాద్‌లో అంతర్జాతీయ సదస్సు

## రష్యా, ఫ్రాన్స్ సహా పలు దేశాల ప్రతినిధుల సమక్షంలో గ్లోబల్ పీస్ కాన్ఫరెన్స్



హైదరాబాద్, జూన్ 26: ప్రపంచ శాంతి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ప్రముఖ న్యూస్ ఛానల్ మరియు బ్లిస్ బర్గ్ ఫ్యూచర్ ఆఫ్ హోప్ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ లో "గ్లోబల్ పీస్ కాన్ఫరెన్స్" ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి రష్యా, ఫ్రాన్స్, అమెరికా తదితర దేశాలకు చెందిన అంతర్జాతీయ దౌత్యవేత్తలు, శాంతి దూతలు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరై ప్రపంచ శాంతి, మానవతా విలువలు, అంతర్జాతీయ సహకారం, దౌత్య సంబంధాల బలోపేతంపై అభిప్రాయాలు వ్యక్తం చేశారు. సదస్సులో గ్లోబల్ ప్రెసిడెంట్ -- ఇంటర్నేషనల్ డిప్లొమాటిక్ క్లబ్, బ్రిక్స్ కల్చర్ అండ్ మీడియా ఫోరం ఉపాధ్యక్షుడు, ఐక్యరాజ్యసమితి యూపీఎఫ్ పీస్ అంబాసిడర్ డా. సెర్గే ద్వోర్యానోవ్, వరల్డ్ అలయన్స్ "పీస్‌మేకర్" వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి యూరీ సఫ్రోనోవ్, ప్రముఖ న్యూస్ ఛానల్ చైర్మన్ లక్ష్మీరావు, జాతీయ నాయకుడు, ప్రముఖ సామాజికవేత్త దుండ్ర కుమారస్వామి, మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు. మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ మిశ్రా మాట్లాడుతూ దేశాల మధ్య పోటీ సహజమేనని, కానీ శత్రుత్వానికి తావు ఉండకూడదని అన్నారు. ప్రపంచ భవిష్యత్తుకు సహకారమే మార్గమని, శాంతి నెలకొంటేనే రైతుకు పంట, యువతకు ఉపాధి, పిల్లలకు విద్య, మహిళలకు భద్రత లభిస్తాయని పేర్కొన్నారు. ప్రముఖ ఛానల్ చైర్మన్ లక్ష్మీరావు మాట్లాడుతూ భారతదేశం వేల ఏళ్ల క్రితమే "వసుధైవ కుటుంబకం" అనే సందేశాన్ని ప్రపంచానికి అందించిందని, ప్రపంచమంతా ఒకే కుటుంబమనే భావనతో మానవత్వం, స్నేహం, శాంతి కోసం అన్ని దేశాలు కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జాతీయ నాయకుడు దుండ్ర కుమారస్వామి మాట్లాడుతూ దేశాల సరిహద్దులు వేరైనా, మానవత్వానికి సరిహద్దులు ఉండవని, ప్రపంచాన్ని ఏకం చేసే శక్తి శాంతి మాత్రమేనని అన్నారు. ప్రపంచంలో అత్యంత విలువైన సంపద మనిషి ప్రాణమని, యుద్ధం విధ్వంసాన్ని సృష్టిస్తే శాంతి అభివృద్ధికి మార్గం చూపుతుందని పేర్కొన్నారు. తుపాకులు సమస్యలను పరిష్కరించలేవని, సంభాషణలు, దౌత్య సంబంధాల ద్వారానే శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని చెప్పారు. ఆయుధాలపై చేసే వ్యయంకంటే విద్య, వైద్యం, మానవాభివృద్ధిపై పెట్టుబడులు ప్రపంచానికి మరింత మేలు చేస్తాయని, యుద్ధంలో గెలిచిన దేశాలు చరిత్రలో నిలిచినా, శాంతిని కాపాడిన నాయకులు మానవ హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోతారని అన్నారు.

ఈ కార్యక్రమంలో వివిధ దేశాలకు చెందిన దౌత్య ప్రతినిధులు, సామాజికవేత్తలు, ప్రజాప్రతినిధులు, మేధావులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## నాలుగు మృతదేహాల కేసులో మిస్టరీకి తెర

**పోలీసులకు సవాల్ గా మారిన హత్య కేసు**

**ఎట్టకేలకు చేదించిన పోలీసులు**

నల్గొండ జూన్ 26( వాయిస్ టుడే): నాలుగు రోజులుగా పోలీసులకు సవాల్‌గా మారిన కుళ్లిన నాలుగు మృతదేహాల కేసులో ఎన్నో మలుపులు,సవాళ్ల నడుమ చేదించిన నల్గొండ పోలీసులు స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ హత్య కేసు వివరాలు వెల్లడించారు కేసును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. డీఎస్పీ శివరాం రెడ్డి నేతృత్వంలో నల్లగొండ పోలీసులు రాత్రింబవళ్లు శ్రమించి ప్రతి ఆధారాన్ని జల్లెడ పట్టడంతో మిస్టరికి తెర పడింది. వందల గంటల సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలు, క్షేత్రస్థాయి విచారణతో కేసును ఛేదించే దిశగా దూసుకెళ్లిన పోలీసులు. చివరకు ప్రధాన నిందితుడిని అదుపులోకి తీసుకొని కటకటాల పాలు చేశారు. కుళ్లిపోయిన మృతదేహాలు, ఆధారాల కొరత, బంధుత్వాల చిక్కుముడి మధ్య ఈ కేసు పోలీసులకు పెద్ద సవాల్‌గా మారగా... నిందితుడి అరెస్టుతో మిస్టరీకి తెర పడింది.

నాలుగు రోజుల నుంచి లివన్ టౌన్ సీఐ ఏమి రెడ్డి రాజశేఖర్ రెడ్డి, టూ టౌన్ సీఐ రాఘవరావు లు నిద్రాహారాలు లేకుండా కేసు చేదనలో చురుకుదనం ప్రదర్శించారు. సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, జితేందర్ రెడ్డి, రూరల్ ఎస్సై శివప్రసాద్, టూ టౌన్ ఎస్ఐ సైదా యు బాబు, నకిరేకల్ ఎస్సై వీరబాబు, సిసిఎస్ బృందం విష్ణువర్ధనగిరి, నాగార్జున ప్రసాద్, పుష్పగిరి, వైదుపాషా, సాయి శివరాజ్ నలగొండ టౌన్ పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొని ఈ కేసులో చురుకుదనం చూపించి పోలీస్ నిర్వచనానికి మరోపేరుగా చేదించినందుకు రాష్ట్రవ్యాప్తంగా నల్లగొండ జిల్లా పోలీస్‌కు ప్రశంసలు. నాలుగు రోజుల్లోనే చాకచక్యంగా వ్యవహరించి కేసును చేదించిన అందరిని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించారు.

## SIRలో భాగంగా రెండవరోజు నాచారంలో ఓటర్లకు ఎమ్యూనరేషన్ ఫార్మ్‌లు పంపిణీ పోతగాని గోపాల్ గౌడ్



నాచారం (వాయిస్ టుడే):కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న SIRలో భాగంగా రెండవరోజు ఉప్పల్ నియోజకవర్గం నాచారం డివిజన్ ఇందిరానగర్ కాలనీ పరిధిలో శక్తి కేంద్ర ఇంచార్జ్ మరియు ఉప్పల్ నియోజకవర్గం BLA-1 పోతగాని గోపాల్ గౌడ్ బూత్ నెంబర్ 223, 224,225 దీూా లు కవిత, అలేఖ్యలతో కలసి ఇంటి ఇంటికి తిరిగి ఓటర్లకు ఎమ్యూనరేషన్ ఫార్మ్ లు అందజేశారు.ఈ కార్యక్రమంలో BLA-2 లు క్రాంతికుమార్, వెంకట్ నాయక్ మరియు BJP సీనియర్ నాయకులు రాజిరెడ్డి పాల్గొన్నారు.

## ఎంపీ వద్దిరాజు స్వగ్రామం ఇనుగుర్తిలో పాఠశాలల నూతన భవనాలకు భూమిపూజ

**రూ.7 కోట్లతో ఆధునిక విద్యా వసతులు**

**ఎంపీ రవిచంద్ర చొరవకు గ్రామస్తుల ప్రశంసలు**



ఇనుగుర్తి, జూన్ 27 (వాయిస్ టుడే): బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర స్వగ్రామం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలకు నూతన భవనాల నిర్మాణం కోసం శుక్రవారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. తాను విద్యాభ్యాసం చేసిన పాఠశాలలు శిథిలావస్థకు చేరుకోవడంతో వాటి అభివృద్ధికి ఎంపీ రవిచంద్ర ప్రత్యేక చొరవ తీసుకున్నారు. బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్, ఓఎన్‌జీసీ వంటి చమురు సంస్థల సహకారంతో రూ.6 కోట్ల నిధులు సమకూర్చడంతో పాటు తన ఎంపీ నిధుల నుంచి మరో రూ.1 కోటి విడుదల చేశారు. మొత్తం రూ.7 కోట్ల వ్యయంతో పాఠశాలలకు ఆధునిక భవనాలు నిర్మించనున్నారు.

పాఠశాల ఆవరణలో ఎంపీ పెద్దన్న వద్దిరాజు కిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో సర్పంచ్ కుమారస్వామి, ఉప సర్పంచ్ సత్తూరి యాదగిరి, మాజీ సర్పంచ్ దార్ల రామూర్తి, సింగిల్ విండో మాజీ చైర్మన్ దీకొండ వెంకన్న, ఎంపీ తమ్ముడు పెద్ద వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు, అధికారులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. నూతన భవనాల్లో విశాలమైన తరగతి గదులు, ప్రహారీ గోడ, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు తదితర ఆధునిక వసతులు కల్పించనున్నారు. స్వగ్రామ విద్యాభివృద్ధి కోసం ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తీసుకున్న చొరవను గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు కొనియాడారు. పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం కావాలి

**ఓటర్ సవరణ కార్యక్రమం ఇన్‌చార్జ్ డాక్టర్ డాక్టర్ రామకృష్ణ పెరుమాండ్ల**

హనుమకొండ, జూన్ 26: భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేసి, అర్హులైన ప్రతి ఓటర్లకు ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని ఓటర్ సవరణ కార్యక్రమం ఇన్‌చార్జ్ డాక్టర్ రామకృష్ణ పెరుమాండ్ల,60వ డివిజన్ అధ్యక్షుడు ఎనుకొంటి పున్నంచందర్ పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో సమావేశమైన ఆయన, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం నిర్వహణపై సమీక్ష నిర్వహించి, చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం 60వ డివిజన్ అధ్యక్షుడు ఎనుకొంటి పున్నంచందర్, జనగాం శ్రీనివాస్, మట్టెపల్లి కమల్‌రాజు, బీఎల్ఓలు, బీఎల్ఏలు కలిసి అధికారులకు ఓటరు నమోదు, పేర్ల సవరణ, చిరునామా మార్పు, కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలకు సంబంధించిన దరఖాస్తులను సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం లో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని అన్నారు. ప్రజలు ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటరు వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు. బీఎల్ఓలు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేసి ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేందుకు కృషి చేయాలని కోరారు.

# 16వ వార్డులో ఎస్ఐఆర్ ప్రక్రియపై మైనార్టీ సోదరులకు అవగాహన సదస్సు




మక్తల్ జూన్ 26 వాయిస్ టుడే ప్రతినిధి: మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు షరీఫా మసీదు వద్దలి రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి గారి ఆదేశాల మేరకులి ముస్లిం ఓటర్లకు లిస్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లి ప్రక్రియపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు స్థానిక వార్డు కౌన్సిలర్ లిఅల్కురి పావనిలి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల సవరణ ప్రక్రియ ఎస్ఐఆర్ కార్యక్రమంపై ప్రజల్లో, ముఖ్యంగా మైనార్టీ వర్గాల్లో అనేక అపోహలు, అనుమానాలు ఉన్నాయన్నారు. "ఓటర్ల జాబితా నుండి పెద్ద ఎత్తున ముస్లిం ఓటర్లను తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే ప్రచారం నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. మీ ఒక్క ఓటును సైతం కోల్పోకుండా జాగ్రత్త పడాలి" అని ఓటర్లకు పిలుపునిచ్చారు.

ఎస్ఐఆర్ ప్రక్రియలో గుర్తుంచుకోవాల్సిన ముఖ్య అంశాలు:

1. లిడాక్యుమెంట్లు సిద్ధం చేసుకోండి:లి బీఎల్ఓ ఇంటికి వచ్చినప్పుడు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటర్ ఐడీ, పుట్టిన తేదీ ధృవీకరణ పత్రం, నివాస ధృవీకరణ పత్రం వంటి అన్ని పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలి.
2. లివివరాలు సరిచూసుకోండి:లి మీ పేరు, ఇంటి నంబర్, వయస్సు, ఫోటో తదితర వివరాలు ఓటర్ జాబితాలో సరిగా ఉన్నాయో లేదో బీఎల్ఓతో కలిసి నిర్ధారించుకోవాలి.
3. లికొత్త ఓటర్లు నమోదు:లి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు, ఇప్పటి వరకు ఓటు నమోదు చేసుకోని వారు వెంటనే ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
4. లితప్పుడు సమాచారం నమ్మవద్దు:లి సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దు. ఏదైనా సందేహం ఉంటే నేరుగా బీఎల్ఓ లేదా మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించాలి.
5. లిహెల్ప్‌లైన్ వినియోగం:లి ఓటరు జాబితా సంబంధిత సమస్యల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1950 లేదా ఎశీవతీ ఎవశ్రీజూశ్రీఅఅవ ాూజూజూ ను వినియోగించుకోవాలి.

"ప్రజాస్వామ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికి రాజ్యాంగం ఓటు హక్కు కల్పించింది. ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఓటు కీలకం. ఒక్క ఓటు సైతం వృథా కాకుండా, తొలగింపునకు గురికాకుండా మనమంతా బాధ్యతగా వ్యవహరించాలి" అని కౌన్సిలర్ పావని సూచించారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లిరహీం పటేల్‌లి, కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ లిఏ. రవికుమార్‌లి, కోఆప్షన్ సభ్యులు లివల్లంపల్లి లక్ష్మణ్‌లి, మైనార్టీ నాయకులు లిహుసముద్దీన్, జహీర్, సలీం, అన్వర్, జమీరుద్దీన్, సయ్యద్, మహమ్మద్ ఆసిమ్, నజీర్ అహ్మద్‌లి తదితరులు పాల్గొని ఓటర్లకు భరోసా కల్పించారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**